మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి మృతి



రాజంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి (78) సోమవారం రాత్రి మృతి చెందారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. మంగళవారం హైదరాబాదులోనే అంత్యక్రియలు జరుగుతాయని ఆయన బంధువులు తెలిపారు. ఆయన 1989లో ఎమ్మెల్యేగా గెలుపొంది 1994 వరకు కొనసాగారు. ఆయన ఎమ్మెల్యేగా ఒకసారి ఉన్నప్పటికీ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. జిల్లాలో ఉద్దండులైన మాజీ మంత్రి, అసెంబ్లీ సింహంగా పేరొందిన బండారు రత్నసభాపతితోనూ, మాజీ మహిళా ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మతోనూ, మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్యతోనూ పోటీ పడ్డారు. ఆయన నిజాయితీ కలిగిన రాజకీయవేత్తగా గుర్తింపు పొంది రాజంపేటలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

తపాలా శాఖ ఉద్యోగి చేతివాటం

- ప్రజలకు చెందిన రూ.18 లక్షలు స్వాహా?
- కేవీపల్లె మండలంలో ఘటన

6



ఒంటిమిట్టలో బ్యాలెట్ బాక్సులను తీసుకెళుతున్న ఎన్నికల అధికారులు

ఒంటిమిట్టలో ఎన్నికల అధికారుల కోసం సిద్ధంగా ఉన్న బస్సులు





నేడే బిగ్‌ఫైట్

- పులివెందుల, ఒంటిమిట్టలో సర్వం సిద్ధం
- 1400 మందితో పోలీసు బందోబస్తు
- వైసీపీ, టీడీపీ మధ్యే పోరు

కడప/ఒంటిమిట్ట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు జరిగిన ఏడాదిన్నర తరువాత మళ్లీ కడప గడ్డపై టీడీపీ, వైసీపీ మధ్య బిగ్ ఫైట్ మంగళవారం జరగనుంది. ఇవి మండలాలకు చెందిన జడ్పీటీసీ ఉప ఎన్నికలే అయినప్పటికీ.. అసెంబ్లీ పోరుకు ఏమాత్రం తీసిపోకుండా జరుగుతున్నాయంటే టీడీపీ, వైసీపీలు ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయో తెలుస్తుంది. వారం రోజులుగా జిల్లానే కాదు స్టేట్, అటు సోషల్ మీడియా అంతా ఈ ఉప ఎన్నికలపైనే దృష్టి సారించింది. పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం రెండు చోట్ల 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పులివెందులలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇక్కడ 10 అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఒంటిమిట్టలో 30 కేంద్రాలకు గాను 15 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.



ఒంటిమిట్ట: ఎన్నికల సామగ్రితో బస్సులో వెళుతున్న సిబ్బంది



ఒంటిమిట్ట: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న జోనల్ అధికారి దివిజ సంపతి

ఓటుకు నోటు, చీర

పులివెందులలో ఎన్నికను టీడీపీ, వైసీపీకి ప్రతిష్టాత్మకంగా మారడంతో ఇక్కడ గెలుపు కోసం ఇరువురు హోరాహోరీగా పోరాడుతున్నారు. ఇక్కడ ఓటుకు రూ.5వేలు ఇచ్చారు. ఇక మహిళా ఓటర్ల కోసం సోమవారం సాయంత్రం చీరలు పంచిపెట్టారు. ఒంటిమిట్టలో ఓటుకు రూ.3వేలు పంచారు.

పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు

ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం మండలంలోని 12 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. మండలంలో మొత్తం 24,606 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 12,050 మంది, మహిళలు 12,556 మంది ఉన్నారు. సోమవారం ఎన్నికల అధికారులు ఆయా బూత్‌లకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను తీసుకెళ్లారు. మండలం మొత్తం పోలీసు పహారాలో ఉంది. సుమారు 700 మంది పోలీసులు మండలంలో విధులు నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారులు రంగస్వామి, జాన్‌ఇర్విన్‌లు తెలియజేశారు. జోనల్ అధికారి దివిజ సంపతి దగ్గరుండి ఎన్నికల సిబ్బందికి విధులు కేటాయించారు. 150 మంది ఎన్నికల సిబ్బంది, మరో 10 మంది రిజర్వు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. జడ్పీటీసీ స్థానానికి ప్రధానంగా వైసీపీ, టీడీపీ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇద్దరి తరపున ఆ పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ తరపున రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. వైసీపీ అభ్యర్థి తరపున రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యేలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇరుపార్టీల నాయకులు ప్రచారాన్ని హోరాహోరీగా నిర్వహించారు. మంగళవారం ఓటర్లు తమ తీర్పును ఇవ్వనున్నారు. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది.

పోటీలో 11 మంది

ఒంటిమిట్టలో టీడీపీ నుంచి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడా మొత్తం 11 మంది పోటీ చేస్తున్నారు.. 24,606 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 150 మంది ఎన్నికల సిబ్బందిని నియమించడంతో పాటు 750 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఒంటిమిట్టలో విధులకు సిద్ధమవుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది

అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత

- సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి



సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చల్లా కళ్యాణి

మదనపల్లె టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తానని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనది శ్రీకాకుళం జిల్లా ఒప్పంగి గ్రామమని, బీకాం హానర్స్ చదివానన్నారు. తొలుత పంచాయతీ సెక్రటరీగా, తరువాత అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా పనిచేశానన్నారు. 2023 సంవత్సరం ఐఏఎస్‌కు ఎంపికై రెండేళ్ల పాటు శిక్షణ పొందానన్నారు. కర్నూల్‌లో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసి మదనపల్లెకు సబ్‌కలెక్టర్‌గా బదిలీపై వచ్చానన్నారు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా పనిచేయనుండటం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వారంలో రెండు మండలాలు పర్యటించి తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తానన్నారు. వీటితో పాటు సివిల్ సప్లైస్, ఇతర విభాగాలపై దృష్టి పెడతానన్నారు. కాగా నూతన సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎం బాబ్జీ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో డీఏవో నిర్మలాదేవి, సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్, సీసీ సాయి, మణి మొదలియార్, కుమారి, శ్రీకాంత్, డీఐలు లక్ష్మీనారాయణ, వెంకటరమణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలి

- మంత్రి నాదెండ్ల మనోహర్
- అట్టహాసంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమాణస్వీకారం



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న పగడాల వరలక్ష్మి, చిత్రంలో మంత్రి నాదెండ్ల మనోహర్, తదితరులు

రైల్వేకోడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మార్కెట్‌యార్డును అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సోమవారం రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. మంత్రి సమక్షంలో మార్కెటింగ్ శాఖ ఏడీ జి.గోపి ఆధ్వర్యంలో కమిటీ చైర్‌పర్సన్ పగడాల వరలక్ష్మి, వైస్ చైర్మన్, కమిటీ డైరెక్టర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైల్వేకోడూరు మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలని, రైతులకు అండగా మార్కెట్ కమిటీ ఉండాలన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ నా రాజకీయ జీవితానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మ ఇస్తే, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ పునర్జన్మ ఇచ్చారన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులకు న్యాయం చేసే విధంగా మార్కెట్ కమిటీ ఉండాలన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రభుత్వ మార్కెట్ యార్డును అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్ర హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఇక్కడ అన్ని వనరులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాశ్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దుద్యాల అనితదీప్తి, జనసేన కడప జిల్లా ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, జనసేన రాయలసీమ కన్వీనర్లు పగడాల చంద్రశేఖర్, పగడాల వెంకటేష్, జోగినేని మణి, కూటమి నాయకులు గునిపాటి రాయుడు, కల్లా చలపతి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, అతికారి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోలేని దుర్మార్గుడు జగన్

- జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమిదే విజయం
- అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే బాధితులకు న్యాయమేదీ!

6

అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



పీజీఆర్ఎస్‌లో బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

సంబేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. లక్కిరెడ్డిపల్లె మండల పరిధిలోని వేములవాండ్లపల్లెకు చెందిన కాల్వ చంద్రశేఖర్ తనకు తల్లిదండ్రులు ఇద్దరూ లేరని అన్నదాత సుఖీభవ స్కీం తనకు గతంలో వచ్చేదని ఇప్పుడు నిలిపివేశారని, మా కుటుంబంలో ఎటువంటి ఉద్యోగస్తులు లేరని కావున తనకు అన్నదాత సుఖీభవ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కలికిరి మండలం చీటీపల్లి గ్రామం మజారా రంగరాథపురానికి చెందిన శ్రీనివాసులు మూడు సంవత్సరాల క్రితం ఒక ప్రమాదంలో వెన్నెముక, ఎడమచేయి, ఎడమ కాలు పూర్తిగా పనిచేయడం లేదని, నా సదరన్ సర్టిఫికెట్‌ను పరిశీలించి నాకు 6 వేలు పెన్షన్ వస్తోందని, నాకు 15 వేలు పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మదనపల్లి మండలం కోటవారిపల్లి గ్రామ పరిధిలోని బండకిందపల్లెకు చెందిన నరసమ్మ నా భర్త మూడు సంవత్సరాల క్రితం మరణించారని, నాకు ఎటువంటి ఆధారం లేదని నాకు వితంతు పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



రాయచోటిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీలో జాయింట్ కలెక్టర్, అధికారులు, విద్యార్థులు

రాయచోటిటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న హర్ ఘర్ తిరంగాలో భాగంగా రాయచోటిలో జిల్లా అధికారులు, విద్యార్థులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్టు వద్ద జరిగిన ప్రారంభ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జాతీయ పతాకాన్ని ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను స్మరించుకోవడం, జాతీయ పతాకం పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని తెలిపారు. చెక్‌పోస్టు నుంచి ప్రారంభమైన ర్యాలీ విద్యార్థుల ఉత్సాహభరిత దేశభక్తి నినాదాలతో, పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొనసాగి నేతాజీ సర్కిల్ వద్దకు చేరుకుంది. 60 అడుగుల పొడవు గల జాతీయ జెండాను విద్యార్థుల చేత పట్టుకుని నడుస్తూ జాతీయ భావ నినాదాలు చేయడం పలువురిని ఆకర్షించింది. అనంతరం అక్కడ మానవహారం ఏర్పాటు చేసి స్వాతంత్ర్య పోరాట వీరుల త్యాగ ఫలాన్ని, జాతీయ పతాకం చారిత్రక ప్రాముఖ్యతను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగభూషణం, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీవో సురేశ్‌బాబు, డీఈవో సుబ్రహ్మణ్యం, ఆర్ఐవో రవి, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, మానవత చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాసంస్థల ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నేతాజీ సర్కిల్ వద్ద 60 అడుగుల జాతీయ జెండాతో మానవహారం



రైతును రాజు చేయడమే చంద్రబాబు లక్ష్యం

- 39 వేల ఎకరాలను కాజేసిన పెద్దిరెడ్డి కుటుంబం
- రూ.230 కోట్లతో హంద్రీ-నీవా లైనింగ్ పనులు
- రైతు సంబర సభలో టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి



టీడీపీ శ్రేణులు, రైతులతో కలిసి ర్యాలీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులను రాజు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. రైతులకు అన్నదాత-సుఖీభవ సాయం అందించిన సందర్భంగా సోమవారం స్థానిక మార్కెట్ యార్డులో నియోజకవర్గ రైతు సంబర సభ జరిగింది. అంతకు మునుపు టీడీపీ కల్యాణమండపం నుంచి బస్టాండు సర్కిల్, మార్కెట్ యార్డు వరకు 150 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జయచంద్రారెడ్డి ట్రాక్టర్ నడిపి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో రూ.230 కోట్లతో హంద్రీ-నీవా లైనింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. అతి త్వరలోనే టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం నియోజకవర్గంలో 39 వేల ఎకరాలను బినామీ పేర్లతో కాజేసిందన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం చేసిన అరాచకాలు, అక్రమాలు ప్రజలు మరిచిపోలేదన్నారు. మళ్లీ ప్రజలను మభ్యపెట్టాలని వస్తున్న వైసీపీ దొంగలను ప్రజలు తరమాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, పారిశ్రామిక వేత్త మంత్రి గిరిధర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల అధ్యక్షుడు వైసీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ములకలచెరువులో 150 ట్రాక్టర్లతో ర్యాలీ

తపాలా శాఖ ఉద్యోగి చేతివాటం

- ప్రజలకు చెందిన రూ.18 లక్షలు స్వాహా?
- కేవీపల్లె మండలంలో ఘటన
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

పీలేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో పొదుపు, చింతలు లేని జీవితానికి మలుపు అంటూ తపాలా శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటుంది. ఆ ప్రచారానికి ఆ శాఖకు చెందిన సిబ్బంది తూట్లు పొడిచిన సంఘటన కేవీ పల్లె మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. కేవీపల్లె మండలం మల్లారపువాండ్లపల్లెకు చెందిన బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఖాతాదారుల సంతకాలు ఫోర్జరీ చేయడమే కాకుండా కొంతమందికి అసలు పాసుపుస్తకాలు కూడా ఇవ్వకుండా సొమ్మును కాజేశాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా నలిగి చివరకు తపాలా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా వారు అతడిని సస్పెండ్ చేశారు. అయితే తాము అతడి వద్ద జమ చేసిన సొమ్ము నిజంగా తపాలా శాఖకు వెళ్లిందో, అతనే కాజేశాడో తెలియక కొంత మంది ఆందోళన చెందుతుండగా తమ పాసుపుస్తకాలు తమకు ఇప్పిస్తే చాలని కొంతమంది మల్లారపువాండ్లపల్లె గ్రామస్థులు అధికారులను వేడుకుంటున్నారు.

రూ.18 లక్షల మేర స్వాహా?

కేవీపల్లె మండలం మల్లారపువాండ్లపల్లెలో బ్రాంచ్ పోస్టాఫీసు ఉన్నది. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న 14 గ్రామాల ప్రజల ఆర్థిక లావాదేవీలకు ఆ పోస్టాఫీసు కేంద్రంగా ఉండేది.

ఆందోళన చెందాల్సిన పని లేదు

మా శాఖ పాసు పుస్తకాల్లో ఎంట్రీ ఉన్న ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. వారందరికీ డబ్బు అందుతుంది. అతను పాసు పుస్తకాల్లో ఎంట్రీ వేయకుండా ఉంటే ఏమీ చేయలేము. అతడిపై ఫిర్యాదులు వచ్చిన మరుసటిరోజే అతనిపై ప్రాథమిక విచారణ జరిపి సస్పెండ్ చేశాం. పీలేరు ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండడంతో విచారణలో ఆలస్యం జరుగుతోంది. ఆయన వచ్చిన వెంటనే విచారణను వేగవంతం చేసి ఖాతాదారుందరికీ న్యాయం చేస్తాం.

- పవన్, పీలేరు ఇన్‌చార్జ్ తపాలా ఇన్‌స్పెక్టర్



మల్లారపువాండ్లపల్లెలోని తపాలా కార్యాలయం

ఉత్తరాల బట్వాడాతో పాటు తపాలా శాఖలో సంప్రదాయబద్ధంగా ఉండే ఆర్‌డీ, ఎస్‌బీ, సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), టైం డిపాజిట్‌లు, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పీఎల్‌ఐ), మని ఆర్డర్ సేవలు, ఉపాధి హామీ బిల్లులు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ సేవలు అందుబాటులో ఉండేవి. ఆ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా రెండేళ్ల క్రితం వచ్చిన చైతన్య ఆ గ్రామంలో జరిగే ఆర్థిక లావాదేవీలను తన అక్రమాలకు ఆలంబన చేసుకున్నాడు. తాను సూచించిన పథకాల్లో డబ్బు డిపాజిట్ చేసుకుంటే స్వల్ప కాలంలో అధిక రాబడులు ఉంటాయని చాలామంది మహిళల వద్ద డిపాజిట్‌లు సేకరించాడు. రూ.50 వేలు డిపాజిట్ చేస్తే ఏడాదిలోనే రూ.లక్ష వస్తుందని, రూ.లక్ష డిపాజిట్ చేస్తే రెట్టింపు అవుతుందని నమ్మబలికాడు.

దీంతో చాలామంది మహిళలు అతడి మాటలు నమ్మి అతనికి డబ్బు అందించారు. పీలేరులోని తపాలా కార్యాలయంలో పాసు పుస్తకాలలో ఎంట్రీ వేయించి ఇస్తానని చెప్పడంతో చాలామంది మహిళలు అతడిని తమ పాసుపుస్తకాలు కూడా అడగలేదు. దీంతో అతను యధేచ్ఛగా వారి నమ్మకాన్ని సొమ్ము చేసుకున్నాడు. అలా ఏకంగా రూ.18 లక్షల మేర ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశాడు. ఎంతకీ పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో కొంతమంది గ్యారంపల్లెలోని తపాలా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో అతడి బండారం బయటపడింది. నెల క్రితం అధికారులు విచారించి అతడి వద్ద పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకుని అతడిని సస్పెండ్ చేశారు.

నేను కట్టిన డబ్బు ఏమైందో తెలియడం లేదు



ఆ పిల్లోడిని నమ్మి నా పాసు పుస్తకాలు అతడి చేతిలో పెట్టిపోయిన మూడేండ్లుగా నెలకు రూ.1500 కట్టాను. ఇప్పుడు ఆ డబ్బు ఉందో, పోయిందో అర్థం కావడం లేదు. ఆ పిల్లోడు ఉన్నప్పుడు అడిగితే ఐదేళ్ల తరువాత తీసుకోవచ్చులే అనేవాడు. నా పాసు పుస్తకాలు చెక్ చేసి నాకు న్యాయం చేయండి.

- అలివేలమ్మ, మల్లారపువాండ్లపల్లె

రూ.1.40 లక్షలు కట్టాను



ఆర్‌డీ, టీడీ, లైఫ్ ఇన్సూరెన్స్ కలిపి నేను మొత్తం రూ.1.40 లక్షలు కట్టాను. నా పాసుపుస్తకాలు కూడా పోస్టాఫీసులోనే ఉన్నాయి. వాటిని చూసుకుందామంటే ఆఫీసర్లు కుదరదు అంటున్నారు. మా డబ్బులు మాకు తిరిగి ఇప్పించాలని పీలేరు పోస్టాఫీసులో కంప్లైంట్ కూడా ఇచ్చాను.

- రాధమ్మ, కిచ్చిలివారిపల్లె

లబోదిబోమంటున్న గ్రామస్థులు

బ్రాంచ్ పోస్టుమాస్టర్ అయిన చైతన్యను నమ్మి అతడి చేతిలో సొమ్ములు పెట్టిన గ్రామస్తులు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. తాము అతడికి ఇచ్చిన సొమ్ములు తమ పాసుపుస్తకాల్లో నమోదయ్యాయో లేదో కూడా తెలియడం లేదని, గ్యారంపల్లె, పీలేరులోని పోస్టాఫీసులలో అడిగితే అతడిపై విచారణ జరుగుతోందని, అప్పటి వరకు ఏమీ తేల్చి చెప్పలేమన్న సమాధానం వస్తోందని వారు వాపోతున్నారు. ఈలోపు అతని తరఫున కొంత మంది గ్రామానికి వచ్చి అతను తీసుకున్న డబ్బులను రెండు, మూడు నెలల్లో తాము చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం వారు కూడా సరైన సమాధానం చెప్పడం లేదని బాధపడుతున్నారు.

నులిపురుగులను నివారిద్దాం

- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

సంబేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శరీరంలోని పేగుల్లో చేరిన నులిపురుగులను ఒక ఆల్బెండజోల్ మాత్రతో చెక్ పెట్టవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. నులిపురుగులు ఉంటే రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పి వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించి వారి పోషకాలను గ్రహించి వారిని శక్తిహీనులుగా మారుస్తాయి చిన్నవయస్సులోనే ఈ నులిపురుగులను నివారిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవు తారు. జాతీయ ఆరోగ్య సంస్థ నులిపురుగుల నివారణకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా...

పిల్లలు మట్టిలో ఆడుకుని చేతులు కడగకుండా భోజనం చేయడం ద్వారా నులిపురుగులు వ్యాప్తి చెందుతాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనలో ఈ పురుగులు వ్యాప్తి అవుతాయి. నులిపురుగుల బారినపడిన పిల్లల్లో ప్రధానంగా రక్తహీనత ఏర్పడుతుంది. పోషక లోపం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారతారు. తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు, మలంలో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ మాత్రల పంపిణీ

నులిపురుగుల నియంత్రణకు మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల వద్ద పిల్లలకు పంపిణీ చేస్తారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కావడంతో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. 1 నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 ఏళ్ల వారికి పాఠశాలలు, కళాశాలల్లో అందజేస్తారు. రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్రమే నీటిలో కలిపి తాగించాలి. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర 400 ఎంజీ వేయించాలి. అన్నమయ్య జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారు జిల్లా వ్యాప్తంగా 3,96,267 మంది ఉన్నారు.

ఏర్పాట్లన్నీ పూర్తి

నులిపురుగుల నివారణకు మాత్రలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వైద్య ఆరోగ్యశాఖ విజయవాడ అడిషినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. భోజనం చేసినతర్వాతనే వీటిని వేసుకోవాలి. మాత్రలు వేసుకున్న వారికి ఏవైనా సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో రియాజ్‌బేగ్, డీఐవో ఉషశ్రీ, డీఎల్ఏటీవో రమేశ్‌బాబు, పీవోఆర్‌బీఎస్‌కే శివప్రతాప్, డీఎస్ఎంవో విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయండి



లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన

తంబళ్లపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబరు 13న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన అన్నారు. సోమవారం స్థానిక సివిల్ కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో వాది, ప్రతివాది సయోధ్య అంగీకారంతో రాజీ మార్గంలో కేసులు పరిష్కారమవుతాయన్నారు. లోక్‌అదాలత్ ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కులు అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి

సుండుపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పంటలు నష్టపోయిన రైతులకు రూ.1.95 లక్షలు నష్టపరిహారం చెక్కులు అందజేసినట్లు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో ఆదేశాల మేరకు ఏనుగులు, అడవిపందుల వలన పంటలు నష్టపోయిన 10 మంది రైతులకు చెక్కులను అందజేశామన్నారు. పంటలు నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం ఈ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అడవి మృగాల వలన పంటలు నష్టపోయినట్లయితే వెంటనే ఫారెస్ట్ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయడం పట్ల బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో అంజనస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మవరం-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు



ములకలచెరువు, ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి): ధర్మవరం నుంచి ములకలచెరువు మాదుగా నరసాపూర్‌కు ప్రతి రోజు నడిచే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు మంగళవారం నుంచి రద్దు కానున్నాయి. గుంటూరు సమీపంలోని పెదవడ్లపూడి - దుగ్గిరాల, తెనాలి-చండూరు రైల్వే సెక్షన్‌లో మూడవ రైలు మార్గం ప్రీఎస్ఐ, ఎన్ఐ పనుల కారణంగా ఈ రెండు రైళ్ళు పాక్షికంగా రద్దు చేస్తు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నరసాపూర్ నుంచి ధర్మవరం(17247)కు నడిచే రైలు మంగళవారం నుంచి ఈ నెల 19వతేదీ వరకు రద్దు చేశారు.

అలాగే ధర్మవరం నుంచి నరసాపూర్(17248) ఎక్స్‌ప్రెస్ రైలు కూడా మంగళవారం నుంచి ఈ నెల 19వతేదీ వరకు రద్దయ్యింది. ఈ నెల 20వతేదీ నుంచి రైళ్ళు తిరిగి నడవనున్నాయి. రైళ్ళ రద్దుతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా ములకలచెరువు, మదనపల్లె, కలికిరి, పీలేరు తిరుపతి తదితర ప్రాంతాల ప్రయాణికులకు ఎంతో అనుకూలంగా ఉన్న రెండు రైళ్ళు వారం రోజులపాటు రద్దయ్యాయి.

కౌలు రైతులను ఆదుకోలేని దుర్మార్గుడు జగన్

- జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమిదే విజయం
- సంక్షేమంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు
- బెంగళూరులో వర్క్ అట్ హోంలో ఉన్న జగన్‌కు ఏమి తెలుసు?
- అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే బాధితులకు న్యాయమేదీ!
- మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం



సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైల్వేకోడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గం అయిన పులివెందులలో గత వైసీపీ ప్రభుత్వంలో కౌలు రైతులు 21 మంది ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలను ఆదుకోలేని దుర్మార్గుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. సోమవారం రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పంపిణీ చేశారన్నారు. పులివెందులలో మృతి చెందిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని పవన్‌కళ్యాణ్ ఉమ్మడి కడప జిల్లాలోని సిద్దవటంలో రైతు సమావేశం ఏర్పాటు చేశారని సమావేశానికి పులివెందుల నుంచి 21 మంది కౌలు రైతులను గుర్తించి రావాలని సమాచారం అందిస్తే 17 మంది మాత్రమే వచ్చారని తెలిపారు. మిగిలిన కౌలు రైతు కుటుంబాలను వైసీపీ నాయకులు భయభ్రాంతులకు గురిచేయడంతో రాలేదన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు 113 మంది ఆత్మహత్య చేసుకుని చనిపోయారన్నారు. వారికి భరోసా ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి ఆదుకున్న ఘనత పవన్‌కళ్యాణ్‌కే దక్కిందన్నారు.

అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే వైఎస్ జగన్ పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. బాధితులకు ఇళ్ల కట్టిస్తామని చెప్పి మాట తప్పి 2024లో జరిగిన ఎన్నికల్లో కొట్టుకునిపోయారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కేసులు, పోలీసుల ఆంక్షలు పెట్టి ప్రజలను, ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు జరిగాయని తెలిపారు. మైసూరివారిపల్లెలో అకారణంగా, అన్యాయంగా జనసేన నాయకులపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఇదే పంచాయతీలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కారుమంచి సంయుక్త జనసేన అభ్యర్థిగా విజయం సాధించిందన్నారు. అందుకనే రైల్వేకోడూరు అంటే పవన్‌కళ్యాణ్‌కు ప్రేమ ఉందన్నారు.

ఉమ్మడి కడప జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలు కూటమికే ఓటు వేస్తారని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో నిలవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీసి ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల్లో ప్రచారం చేశారని ప్రశ్నించారు. బెంగళూరులో వర్క్ అట్ హోంలో ఉన్న వైఎస్ జగన్‌కు ప్రజల గురించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఎలా నడపాలో తెలియదన్నారు. రైల్వేకోడూరులో శీతల గిడ్డంగిని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని తెలిపారు. ఉద్యాన పంటలైన మామిడి, అరటి, బొప్పాయి తదితర వాటికి మద్దతు ధర ఇచ్చింది కూటమి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ అందిస్తున్నామన్నారు.

అనుభవం కల్గిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పవన్‌కళ్యాణ్ ఆలోచనలతో రాష్ట్రం సుభిక్షంగా ఇంకా 15 ఏళ్ల పాటు ఉండాలన్నారు. రాష్ట్రంలో 4.40 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైల్వేకోడూరు వారికి అండగా, తోడుగా ఉంటామని చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోకుండా అందరూ కలసికట్టుగా ఉండాలన్నారు.

రాయచోటి మార్కెట్ కమిటీ

పాలకవర్గం నియామకం

కలికిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక సంవత్సరం కాల వ్యవధితో ఈ పాలకవర్గం ఏర్పాటైంది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే హోదాలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధ్యక్షుడిగా బోడిరెడ్డి రాంప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్లుగా కీర్తి, కోటకొండ శంకర, కాటిమాయకుంట చంద్రయ్య, జల్లా రామతులసి, కొండా లక్ష్మి, వేల్పుల సుజాత, సానంపల్లె జ్యోత్స్న, తంగల వెంకట్రమణ, చామంతుల వెంకటనాగులు, కోటకొండ రఘునాథ, ఉదయగిరి మస్తాన్‌వలి, కూన బాల మురళీకృష్ణ, ముడే తవరా నాయక్‌లను నియమించారు. గొర్లముదివీడు సింగిల్ విండో చైర్మన్, రాయచోటి వ్యవసాయ ఏడీ, రాయచోటి మున్సిపాలిటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారులను కూడా కమిటీలో నియమించారు.

కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ కథనం మేరకు... గాలివీడు మండలానికి చెందిన అనిల్ (35), బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన స్వరూపను 12 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు జేమ్స్ (6), కుమార్తె లిపిక (4) ఉన్నారు. వీరు రెండేళ్ల క్రితం మదనపల్లె మండలం నిమ్మనపల్లె రోడ్డులోని బసినికొండకు వచ్చి నివాసం ఉంటున్నారు. అనిల్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ ఖర్చులు పెరగడంతో స్వరూప తిరుపతిలోని ఓ ప్రైవేటు రెస్టారెంట్‌లో పనిచేస్తోంది. పిల్లలు అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. కాగా అనిల్ ఆటో కొనుగోలు చేయడానికి రూ.30 వేలు కావాలని భార్య స్వరూపకు ఫోన్ చేశాడు. ఇప్పట్లో కుదరదని చెప్పడంతో వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు రోజుల తరువాత దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి భార్యకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ వెంకటరమణ తెలిపారు.

రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

సంబేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల సవరణ, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌వోలను నియమించి సంబంధిత నియామక పత్రాలను ఈఆర్‌వోలకు సమర్పించాలని తెలిపారు. కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలనుకుంటే దానికి ఎన్నికల సంఘం అవకాశం ఇస్తారన్నారు. సమావేశంలో రాజంపేట, మదనపల్లె సబ్‌కలెక్టర్లు, హెచ్ఎస్ భావన, చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం



షాపుపై పడిన 11 కేవీ వైరు

గుర్రంకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ బస్టాండులో ప్రజలు, వ్యాపారస్తుల సౌకర్యార్థం 11 కేవీ, ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేశారు. ఈ విద్యుత్ స్తంభాల నుంచి వ్యాపారులు, ప్రజలు కరెంట్ సరఫరాను దుకాణాలకు, ఇళ్లకు తీసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో బస్టాండులోని 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ సమయంలో కొంత మంది మాత్రమే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యుత్ వైర్లు ఒక దానిపై ఒకటి పడడంతో నిప్పు రవ్వలు రేగాయి. దీంతో ప్రయాణికులు పరుగులు తీశారు. పండ్లు, పూల దుకాణాలపై తెగిన విద్యుత్ వైర్లు పడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు, ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు తెగిన విద్యుత్ వైర్లను సరిచేశారు.

బావిలో పడి వ్యక్తి మృతి



చిన్నప్ప మృతదేహం

రామాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువ హరిజనవాడకు చెందిన రేణిమణి చిన్నప్ప (52) అనే వ్యక్తి సోమవారం బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ ఎగువహరిజనవాడకు చెందిన రేణిమాణి చిన్నప్ప బావిలో మోటారు చెడిపోయిందని ఉదయం 9 గంటల సమయంలో బావిలోకి దిగాడు. తదుపరి గంటల పాటు ఆయన పైకి రాకపోవడంతో గ్రామస్థులు ఆయన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఫైర్ డిపార్టుమెంట్ రామాపురం పోలీసులు, రెవెన్యూశాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బావిలో గాలింపు చర్యలను ప్రారంభించారు. మృతుడు బావిలో ఉన్న మోటారు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

గాలివీడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ మాతాశిశు సంరక్షణ డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీవార్మింగ్‌డే నులిపురుగుల నిర్మూలన, రక్తహీనత అధిగమించేందుకు విద్యార్థులకు కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అందులో భాగంగా మంగళవారం ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను మింగించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రియాజ్, డాక్టర్ శ్వేత, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, ఫయాజ్, హరీశ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రాజన్న (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం ఎరగానిమిట్ట వద్ద గురువారం సాయంత్రం బీఎస్ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న అల్లూరి రాజన్న (55) జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఆటో కోసం వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజన్నను స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

వైసీపీ వ్యాజ్యం ఉపసంహరణ

● ఎస్ఈసీ, పోలీసులు నిబంధనల ప్రకారం నడుచుకుంటారన్న కోర్టు

అమరావతి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ఏజెంట్లకు భద్రత కల్పించేలా రాష్ట్రఎన్నికల సంఘం, పోలీసు అధికారులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ తరపున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మల హేమంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వాజ్యం పై సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమన్నారు. ఎస్ఈసీ, పోలీసులు చట్టనిబంధనల ప్రకారం నడుచుకుంటారన్నారు. తాము ఏదైనా ఉత్తర్వులు జారీ చేస్తే క్లిష్టమైన పరిస్థితులకు దారి తీస్తాయని పేర్కొన్నారు. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి జోక్యం చేసుకుంటూ పిటిషన్‌ను ఉపసంహరించుకొనేందుకు అనుమతించాలని కోరారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

మారెడ్డి భరత్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలంటూ వేసిన వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థికి మారెడ్డి లతారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డిని ఎస్ఈసీ, పోలీసులు కల్పించిన సౌకర్యాలను దుర్వినియోగం చేస్తున్నారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతకముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ... స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి ఇచ్చామన్నారు. మారెడ్డి భరత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.... ఓ పార్టీకి అభ్యర్థిగా మద్దతుగా స్వతంత్ర అభ్యర్థి ప్రచారం చేయకూడదని చట్టంలో ఎక్కడా లేదన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలన్నారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరైనవే : ధర్మాసనం

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ సమర్పించిన వినతి పై ఇప్పటికే ఎస్ఈసీ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేసింది. అప్పీల్‌ను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ప్రక్రియను రికార్డు చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే సమయంలో పోలింగ్ ఏజెంట్లను అనుమతించాలని, తటస్థ ఎన్నికల అబ్జర్వర్లను నియమించాలని, ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయకుండా పోలీసులను నిలువరించాలని కోరుతూ వైసీపీనేతలు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. వ్యాజ్యాల పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీతో పాటు జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీనేతలు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. అప్పీల్ సోమవారం విచారణకు రాగా సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... తటస్థ అబ్జర్వర్లను నియమించాలని, సీసీకెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నిక ప్రక్రియను రికార్డు చేయాలన్న పిటిషనర్ వినతిని సింగిల్ జడ్జి తిరస్కరించారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఎన్నికను స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించాలని సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులే ఇచ్చారని స్పష్టం చేసింది.

ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగర డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. జాతీయ క్రీడాదినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం బ్యాడ్మింటన్ ఎంపికలు జరిగాయి. ఇందులో సుమారు 40మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టు ఎంపిక చేశారు. ఈసందర్భంగా డీఎస్‌డీవో జగన్నాథరెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడలో కడప జిల్లాకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16, 17 తేదీల్లో తిరుపతిలో జరగనున్న జోనల్‌స్థాయి పోటీల్లో.. అనంతరం విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ సుదర్శన్, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

జోనల్ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు : పూజిత, రెడ్డిపద్మిని, సాయి నిఖిత, బి.కళ్యాణి **బాలుర జట్టు :** విశ్వతేజ, యోగేశ్, జశ్వంత్, పవన్‌రెడ్డి


పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల



మైలవరం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ, పోలీసు అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా.. ఉత్తర, దక్షిణ కాలువలకు 100 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. దీనికితోడు వర్షం ధాటికి ఎక్కువగా నీటి ప్రవాహం ఉందని, పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం నీటి నిలువ సామర్థ్యం 6.5టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రస్తుతం 5.4 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉధృతంగా పెన్నా ప్రవాహం



పెన్నానదిలో లోలెవల్ కాజ్‌వేపై వరద నీటి ప్రవాహం

సిద్దవటం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గంట గంటకు నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు గ్రామాలైన వంతాటిపల్లె, గాండ్లపాలెం, ఆకుల వీధి, జ్యోతి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో నీటిమట్టం పెరగడంతో లోలెవల్ కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోందని, చేపల వేటకు వెళ్లే జాలర్లు వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశామని, కొన్ని పల్లె ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లపై రూల్స్ విడుదల

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలపై సాంకేతిక విద్యాశాఖ కొత్త రూల్స్ విడుదల చేసింది. 'ఏపీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల నియంత్రణ, రాష్ట్ర స్థాయి సాంకేతిక విద్యాసంస్థల నిబంధనలు-2025' పేరుతో ఈ రూల్స్ రూపొందించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ 1988లో ఇచ్చిన 146 జీవో ఆధారంగానే ప్రతి సంవత్సరం పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రతి ఏడాదీ సవరణలు ఇస్తున్నారు. ఇకపై ప్రతిసారీ సవరణల అవసరం లేకుండా కొత్త రూల్స్ జారీచేశారు. పాలిసెట్ నిర్వహణ, పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలే యథావిధిగా అమలవుతాయి. పాలిసెట్, అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం కొనసాగుతుంది. ఇందుకోసం వేర్వేరుగా కమిటీలు నియమించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రూల్స్ అమల్లోకి వస్తాయి.

కాంట్రాక్టు జేఎల్స్‌ను క్రమబద్ధీకరించాలి

అమరావతి, తాడేపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ తిరిగి ప్రారంభించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు జేఎల్స్‌ను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభించారని, ఎన్నికల సమయంలో దానికి బ్రేక్ పడిందని, ఇప్పుడు తిరిగి కొనసాగించాలని నినాదాలు చేశారు. ఇంటర్ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ తాతారావుకు వినతిపత్రం అందజేశారు.

నా కారు ఇప్పించి ఆదుకోవాలి

● జిల్లా అధికారులకు ఓ బాధితుడి ఆవేదన

కడప మారుతీనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం కారు కొనుగోలు చేసి జీవి స్తున్నానని, తన కారును బాడుగ పేరుతో తీసుకెళ్లి ఓ వ్యక్తి మో సం చేశాడని గోపవరం మండ లం మడకలవారిపల్లెకు చెందిన జి.సిద్దయ్య ఆవేదన వ్యక్తం చేశా రు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ 31 టీపీఏ 1113 అనే నెంబరు గల తన ఇటియో కారును 2024 మార్చిలో కొను గోలు చేసి బాడుగలకు తిప్పుకుని జీవనం సాగిస్తున్నానన్నారు. ఈ క్రమంలో బద్వేలుకు చెందిన సుంకర విశ్వనాథ్ అనే వ్యక్తి తన కారు ను నాలుగు రోజులు బాడుగకు అని చెప్పి తీసుకెళ్లి... తిరిగి తనకు ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై తనను అడగ్గా... కడపలోని ఓ ప్రభుత్వ కార్యాలయానికి బాడుగకు పెట్టానని, నెలకు రూ.21,500 వస్తుందని.. ఆ డబ్బులు ఇస్తానని చెప్పాడన్నారు. ఒక నెల డబ్బులు మాత్రం ఇచ్చాడని, తరువాత డబ్బులు ఇవ్వకుండా.. కారు అప్పగించకుండా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. ఈ విషయంపై ఎనిమిది నెలల క్రితం ఎస్పీకి ఫిర్యాదు చేయగా.. బద్వేలు స్టేషన్‌కు రెఫర్ చేశారన్నారు. అక్కడ తనకు న్యాయం చేయడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి తన కారును తనకు ఇప్పించాలని కోరారు. సమావేశంలో కత్తి చెంగ్రాయుడు, జామవా, కేశవ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

● మోడల్‌స్కూల్ స్టేట్ అబ్జర్వర్ నాగేంద్రకుమార్



మోడల్ స్కూల్ సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ నీట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ పీవీ నాగేంద్రకుమార్ తెలిపారు. సోమవారం జిల్లాలోని పలు ఏపీ మోడల్ స్కూల్స్‌ను పరిశీలించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం భుజించి రుచిని, నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలోని సిబ్బందితో సమావేశమై ఆహారం, పరిశుభ్రత, క్రమశిక్షణ విషయంలో సూచనలు సలహాలు ఇచ్చారు. ఆహారం రుచికరంగా, నాణ్యతగా అందించాలన్నారు. పిల్లలు రోగాల బారినపడకుండా ఉండాలంటే పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం ఎఫ్ఏ-1 పరీక్షలు జరుగుతున్నందున పిల్లల స్టాండర్డ్స్‌ని పరిశీలించారు .పిల్లల స్టాండర్డ్స్ పెంచడంలో ఎక్కడా రాజీపడకుండా మంచి విద్యను అందించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ క్లాసులు ప్రసారమవుతున్నాయన్నారు. వాటిని వినియోగించుకొని పిల్లలు చక్కగా చదువుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు పాఠశాల సిబ్బంది చేయాలని ఆదేశించారు. పిల్లలు సక్రమంగా వినియోగించుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని హితబోధ చేశారు. అబ్జర్వర్ వెంట కడప జీసీడీఓ దార్ల రూత్‌ఆరోగ్య మేరీ ఉన్నారు.

తలసరి ఆదాయంపై మోడీవి అవాస్తవాలు

వేంపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తలసరి ఆదాయంలో భారత్ దూసుకుపోతోంది, నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని, మూడవ స్థానానికి చేరుతుందని ప్రధానిమోడీ చెప్పేవి అవాస్తవాలని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. 191 దేశాలలో తలసరి ఆదాయంలో భారత్ 137వ స్థానంలో ఉందని, ఇటీవల విడుదలైన ఇంటర్నేషనల్ మానిటరంగ్ ఫండ్ నివేదిక చెబుతోందన్నారు. జనాభా ఎక్కువ ఉన్న కారణంగా జీడీపీ ఎక్కువ కనిపిస్తోంది. అందువల్ల జీడీపీలో ముందు ఉన్నట్లు అనిపిస్తుంది తప్ప ప్రపంచంలోని మిగతా దేశాలతో పోల్చితే వెనుకబడి ఉందని తులసిరెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి కోరారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని.. ఆసక్తిగలవారు మైలవరం బాలికల గురుకుల పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తామని, ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయస్థాయి కరాటే పోటీలలో పార్నపల్లె విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

లింగాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ నిషార్, ఆర్.కుషాల్ కుమార్‌లు కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం జరిగిన 7వ జాతీయస్థాయి ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025లో ప్రతిభ చూపారు. ఈ పోటీలలో షేక్ మహమ్మద్ నిషార్ గోల్డ్ మెడల్ సాధించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఖోఖో పోటీలకు సోదరుల ఎంపిక



ఎంపికైన సోదరులు ముక్తుమ్‌సాబ్, అబ్దుల్‌కలాం

దువ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామానికి చెందిన ఎస్.ముక్తుమ్‌సాబ్, వీరి సోదరుడు అబ్దుల్‌కలాం రాయలసీమ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఖాదర్‌రెడ్డి తెలిపారు. కడపలోని స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో వీరు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో ఈనెల 16, 17, 18 తేదీల్లో రాయలసీమస్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు.

స్కూటర్లు ఢీ... ఇరువురికి గాయాలు



ఖాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె సమీపంలో రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు రహమత్‌ఖాన్‌పల్లెకు చెందిన ఇ.చిన్ననాగిరెడ్డి పని నిమిత్తం ఖాజీపేటకు వస్తున్నాడు. అదే సమయంలో బద్వేలు నియోజకవర్గం కొంగలవీడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి పులివెందుల నుంచి ఇంటికి వెళుతున్నాడు. కోటంగురాయునిపల్లె సమీపంలోకి రాగానే రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 ద్వారా కడపకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ప్రశాంత్ (ఫైల్‌ఫొటో)

కొండాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంక య్యకాలువ గ్రామంలో ఈనెల 9వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ప్రశాంత్ (22) అనే యువకుడు గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చదువు మానేసి ఇం ట్లోనే ఉంటున్నాడు. చిన్న వయసులోనే షుగర్‌వ్యాధి రావడంతో జీవితం మీద విరక్తి చెంది 9వ తేదీ సాయింత్రం ఇంట్లోనే గడ్డిమందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు అతనిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌నాయక్ తెలిపారు.

కుక్క అడ్డురావడంతో.. స్కూటర్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



ఖాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని ఖాజీపేట బ్రిడ్జి వద్ద సోమవారం కుక్కను ఢీకొనడంతో దిలీప్‌కుమార్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ప్రొద్దుటూరు రాజుపాళెంకు చెందిన దిలీప్‌కుమార్ పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వెళుతుండగా ఖాజీపేట బ్రిడ్జి వద్ద కుక్కలు అడ్డం రావడంతో స్కూటర్ అదుపు తప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా ప్రొద్దుటూరుకు తరలించారు.

బ్రహ్మంగారిమఠంలో...



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సోమి రెడ్డిపల్లెకు చెందిన బొమ్ము రామ్మోహరెడ్డి ద్విచక్రవాహనంపై మైదుకూరుకు వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.28లక్షలు



ఆలయ ప్రాంగణంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న భక్తులు హుండీలో స్వామివారికి సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.28,22,899 నగదు వచ్చినట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరాచారి, దేవదాయశాఖ ఆఫీసరు భారతి తెలిపారు. అలాగే బంగారు 35.500 గ్రాములు, వెండి 990 గ్రాములు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.లక్షా 1116 విరాళం



మఠాధిపతికి చెక్కు అందిస్తున్న దాత చక్రవర్తి దంపతులు

జగన్మాత ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణం కోసం దాతలు రూ.1,01116లు విరా ళం ఇచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడ వాసి జి.శ్రీనివాస చక్రవర్తి తన కుటుంబసభ్యులతో కలిసి విరాళ చెక్కును మఠాధిపతి వీరశివకుమారస్వామికి అందజేసినట్లు ఆయన తెలిపారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఇరువురికి గాయాలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి మంగంపేట పరిసరాల్లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. రైల్వేకోడూరు నుంచి రాజంపేట వైపు ఓ ద్విచక్ర వాహనదారుడు వెళుతుండగా.. ఓబులవారిపల్లె మండలం పోలివాండ్లపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్ ద్విచక్ర వాహనంలో కోడూరు వైపు వస్తున్నాడు. కాగా ఎదురెదురుగా వస్తుండడంతో ప్రమాదవశాత్తు ఢీకొన్న ఘటనలో ఇరువురుకి గాయాలయ్యాయి. అటు వైపుగా వెళుతున్న స్థానిక టీడీపీ మైనార్టీ నాయకుడు జమీర్ అక్బర్‌బాషా సమీపంలో ఉన్న ఏపీ ఎండీసీ ఆసుపత్రికి సంబంధించిన అంబులెన్స్‌ను పిలిపించి వైద్య చికిత్స నిమిత్తం రైల్వేకోడూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అక్బర్‌బాషాను పలువురు అభినందించారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సిద్దవటం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం కోట నుంచి సోమవారం జాతీయ జెండాలు చేతపట్టుకుని విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ నెల 2 నుంచి 15 వరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కడప జిల్లా పురాతత్వ సర్వేక్షణ కన్జర్వేషన్ అసిస్టెంట్ డాకా రెడ్డి ఆధ్వర్యంలో ఎంటీఎస్ స్వరూప్‌రామ్ సిద్దవటం కోట నుంచి ప్రధాన రహదారి గుండా విద్యార్థులు భారత్‌మాతాకీ జై అంటూ ర్యాలీని నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలకడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాయచోటికి మార్చబడ్డ కలకడ బాలికల గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆయేషాబాను తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ కేటగిరీలకు సంబంధించి 5వ తరగతిలో 51, 6 తరగతిలో 41, 7తరగతిలో 22, 8వ తరగతిలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈ నెల 14లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 16న ఉదయం పరీక్ష ఉంటుందని తెలిపారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, రాజంపేట.
I.A. No. 428/2024 in O.S. No. 161/2024
అరిటాకుల నాగరాజు ...పిటిషనర్/వాది
Vs
6. అరిటాకుల నాగార్జున తండ్రి అరిటాకుల గోవిందయ్య, డి.నెం. 8/83, సాతువీధి, మన్నూరు గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్యజిల్లా.
.... రెస్పాండెంట్ / ప్రతివాది నెం.6
నోటీసు
పైన తెలిపిన పిటిషనర్/వాది రెస్పాండెంట్లైన నీపై టెంపరరీ ఇంజక్షన్ కోరుతూ పై కోర్టు నందు పై దావా దాఖలు చేసి ఉన్నాడు. మీకు ఎలాంటి ఆక్షేపణలున్న యెడల 21-8-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగాని లాయర్‌ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
"బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్"
కె. రవిశంకర్, అడ్వకేట్, రాజంపేట

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు, రాజంపేట.
O.S. No. 161/2024
అరిటాకుల నాగరాజు ...వాది
Vs
6. అరిటాకుల నాగార్జున తండ్రి అరిటాకుల గోవిందయ్య, డి.నెం. 8/83, సాతువీధి, మన్నూరు గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్యజిల్లా.
.... ప్రతివాది నెం.6
సమను
పైన తెలిపిన వాది ప్రతివాదైన నీపై భాగ పరిష్కారం కోరుతూ పై కోర్టు నందు దావా దాఖలు చేసి ఉన్నాడు. మీకు ఎలాంటి ఆక్షేపణలున్న యెడల 21-8-2025 తేదీన ఉదయం 10.30 గంటలకు స్వయంగాని లాయర్‌ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ జేయడమైనది.
"బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్"
కె. రవిశంకర్, అడ్వకేట్, రాజంపేట

హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

సంబేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఇండియా ఫైట్స్ హెచ్‌వీ అండ్ ఎస్టీఐ అనే థీమ్‌తో హెచ్‌ఐవీ నిర్మూలనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా హెచ్‌ఐవీ/ ఎయిడ్స్ నిర్మూలన, నియంత్రణ మండలి (డీఏపీసీయూ) రూపొందించిన గోడపత్రికను సోమవారం పీజీఆర్‌ఎస్ హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ లేదా ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ గోడపత్రికలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల చిన్న చూపు వివక్షతను రూపుమాపేందుకు హెచ్‌ఐవీ చట్టం 2017, టోల్ ఫ్రీ నెంబర్ 1097 మొదలైన వాటిపై అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఈ ఆవిష్కరణలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ అడాప్షన్ వాల్‌పోస్టర్ విడుదల

పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలిసొచ్చే కాలానికి- నడిసొచ్చే పిల్లలు పోస్టర్ అడాప్షన్ వాల్‌పోస్టర్లు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్, ఐసీడీఎస్ అధికారులతో కలిసి కలెక్టర్ శ్రీధర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6-18 సంవత్సరాలలోపు పిల్లలను రెండు సంవత్సరాల పాటు పెంచి తదుపరి శాశ్వతంగా దత్తత పొందే అవకాశం పోస్టర్ అడాప్షన్ ద్వారా కలుగుతుందని తెలిపారు. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. సీఏఆర్ఏ.డబ్ల్యుసీడీ.జీవోవీ.ఇన్ ద్వారా రిజిస్ట్రేషన్, ఇతర వివరాలను సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ సర్వే భరత్‌కుమార్, ఐసీడీఎస్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రహదారికి అడ్డంగా వృక్షం

● తొలగించిన ఎండోమెంట్ సిబ్బంది



నిత్యపూజకోనకు వెళ్లే రహదారిలో నేలకొరిగిన వృక్షం

సిద్దవటం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో నిత్యపూజేశ్వరకోనకు వెళ్లే రహదారి లంకమల అటవీ ప్రాంతం మూతికోన ప్రాంతంలో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సంతో పెద్ద వృక్షం నేలకొరిగి రహదారికి అడ్డంగా పడిపోయింది. దీంతో అటుగా వెళ్లే శివభక్తులకు ఆటంకంగా మారడంతో స్పందించిన ఎండోమెంట్‌శాఖ సిబ్బంది అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన వర్షాలకు వృక్షం నేలకొరిగి రహదారికి అడ్డంగా ఉండడంతో తొలగింపు చేపట్టామని, శివ భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే పంచలింగాల వద్ద తాగునీటి గుండాల్లో బ్లీచింగ్ పిచికారి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

సంబేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వీరబల్లి కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల స్పెషల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రుల పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. కేజీబీవీ స్పెషలాఫీసర్‌ను వెంటనే తొలగించాలని, లేదంటే తమ పిల్లలను పంపమంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయుల పట్ల కూడా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తెలియజేశారు. అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

గాలివీడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రెడ్స్, సేవ్ ట్రస్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా మొక్కలు పంపిణీ చేసినట్లు రెడ్స్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులు తెలియజేశారు. సోమవారం మండలంలోని పలువురు రైతులకు మొక్కలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, పెద్దమండెం, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో బోరు కలిగి నీటి సదుపాయం ఉన్న రైతులు తమ సిబ్బందిని 8977178283 నెంబర్‌ను సంప్రదిస్తే మామిడి, సపోటా, నేరేడు, నిమ్మ తదితర మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సేవ్ ట్రీస్ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ అరుణ్‌కుమార్, రెడ్స్ ఫీల్డ్ కోఆర్డినేటర్ కిరణ్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

నులిపురుగుల నివారణపై ర్యాలీ





పిల్లలకు నులిపురుగుల మందులు పంపిణీ చేస్తున్న హెల్త్ డిపార్టుమెంటల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ దిలీప్‌గుప్తా, తదితరులు

రాయచోటిటౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఈ నెల 12న పురస్కరించుకొని జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ అధికారి ఆధ్వర్యంలో సోమవారం రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు శివాలయం సెంటర్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎంవో డాక్టర్ రియాజ్‌బేగ్ మాట్లాడుతూ 12న ప్రతి పిల్లవాడికి ఆల్బెండజోల్ 400 గ్రాముల మాత్రలను మింగించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించి మాత్రలను మింగించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్లు రవిశంకర్, ఖాదర్‌బాషా, దామోదర్‌రాజు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సుండుపల్లె: నులిపురుగుల నివారణ పోస్టర్లు ఆవిష్కరించినట్లు చిన్నపిల్లల వైద్యుడు దిలీప్ ఎగుప్తా తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్, డాక్టర్ పర్హానాతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 10,309 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్నట్లు తెలిపారు.

రామాపురం: నులిపురుగుల నివారణకు 1-19 వయస్సు గల పిల్లల్లో ఆల్బెండజోల్ 400 ఎంల్ ఇవ్వాలని హెల్త్ డిపార్టుమెంట్ అడిషనల్ డైరెక్టర్ ఏవీఎన్‌ఎస్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని బి.రాచపల్లి ప్రాథమిక పాఠశాలకు పంపిణీ చేశారా లేదా పాఠశాల ఉపాధ్యాయుడు రామచంద్రను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వినోద్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అపరిశుభ్రతలో నిత్యపూజకోన కల్యాణకట్ట

● మండిపడుతున్న శివభక్తులు



నిత్యపూజకోన కల్యాణకట్ట వద్ద పేరుకుపోయిన అపరిశుభ్రత

సిద్దవటం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): లంకమల్ల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోన కల్యాణకట్ట వద్ద అపరిశుభ్రత పేరుకుపోవడంతో శివ భక్తులు మండిపడ్డారు. మండలంలోని వంతాటిపల్లె లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోన సోమవారం జిల్లా నలుమూలల నుంచి శివ దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణకట్ట వద్ద అపరిశుభ్రత పేరుకుపోయి దర్శనానికి కాలినడకన వెళ్లే భక్తులకు ఇబ్బందికరంగా ఉందని వెంటనే తొలగింపు చేపట్టాలని భక్తులు కోరారు. ఈ సందర్భంగా శివభక్తుడు నరసింహ మాట్లాడుతూ భక్తులు తమ మొక్కులు చెల్లించే కల్యాణకట్ట వద్ద అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన వస్తున్నా తొలగింపు చేపట్టకుండా నిర్లక్ష్యం తగదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని అపరిశుభ్రత ప్రాంతాల్లో బ్లీచింగ్ అబేట్ పిచికారి చేయాలని శివ భక్తులు కోరారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎండోమెంట్ ఈవో శ్రీధర్‌ను వివరణ కోరగా కల్యాణకట్ట వద్ద ఉన్న తలనీలాల అపరిశుభ్రత ప్రాంతాల్లో తొలగింపు చేపట్టి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేస్తామన్నారు.

బాధితులకు సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



బాధితుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న సాయిలోకేష్ తదితరులు

రాజంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం తాళ్లపాక గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న యముక సాయిహారికకు సీఎం సహాయనిధి ద్వారా రూ.60920 చెక్కును బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి సహకారంతో బాధితుని ఇంటివద్దకు వెళ్లి ఈ చెక్కును అందజేశామన్నారు. ఆపదలో పేదవారికి సీఎం సహాయనిధి అందజేయడం ఓ వరమన్నారు. సీఎం సహాయనిధి అందుకున్న హారిక కుటుంబ సభ్యులు సీఎం నారా చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభావతి, రమణయ్య, కృష్ణయాదవ్, షబ్బీర్, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్తుమారెమ్మకు పాల పూజ



అమ్మవారికి పాలపూజ నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతిలో గల అరవపల్లె ముత్తుమారెమ్మతల్లి దేవస్థానం నందు జాతర మహోత్సవాల సందర్భంగా మూడో రోజు సోమవారం రాత్రి 7.30 గంటలకు పాలపూజ కార్యక్రమం అర్చకులు నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి అమ్మవారిని శాంతింపజేశారు. మహిళలు పాల పూజ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన కోలాటం అందరిని అలరించింది. పాలపూజతో ముత్తుమారెమ్మ జాతర మహోత్సవం ముగిసింది.

మదనపల్లె-1 డిపోలో డ్రైవర్లు కావాలి

మదనపల్లెఅర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-1 డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల వయస్సు 21 నుంచి 40 ఏళ్ల వరకు ఉండి ఆర్టీఏ క్లియరెన్స్ ధ్రువపత్రాలతో దరఖాస్తులను డిపో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంపికైన వారిని రోజువారి అవసరాల మేరకు విధుల్లోకి తీసుకొంటామని తెలిపారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ

గాలివీడు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు పంచాయతీ బోడసాని వాండ్లపల్లెలో సోమవారం సీతా, రామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాములోరి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మొదటి రోజు అనగా 9న కలశస్థాపన, మంటపరాధన, అగ్నిప్రతిష్ఠాపన, దీక్షాహోమాలు, తీర్థప్రసాదాలు, మంగళహారతి వంటి కార్యక్రమాలను నిర్వహించారు. పదవ తేదీన ప్రాతఃకాల పూజలు, విశేష హోమాలు, యంత్రాభిషేకం, మహాస్నానం, పుష్ప పూజ వంటి కార్యక్రమాలను నిర్వహించగా సోమవారం సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారాముల వారికి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తాదులకు మూడు రోజులుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

108 సిబ్బందికి సౌకర్యాల కల్పన



సిబ్బందికి మంచాలు, కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ వాహన సిబ్బందికి అధికారులు రూమ్ కేటాయించారు. వారికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతుంటే వారి ఇబ్బందులు గుర్తించిన స్థానిక ఎన్నారై భూషణం అన్నమయ్య తమ్ముడు విశాల్‌మేఘ, విశాల్ మేఘ మార్ట్‌ల మేనేజర్ భూషణం, మల్లికార్జున వారి తండ్రి శ్రీనివాసులు వారి కుటుంబీకులు కనీస సౌకర్యాల కల్పనలో భాగంగా మంచాలు, కుర్చీలు, ఫ్యాను, వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. కాగా దాతలకు 108 సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూషణం, శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దీనదయాల్ జయంతి వేడుకలు



దీనదయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సంబేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ధార్మిక సేవలో సామాజిక బాధ్యతలో ఆదర్శప్రాయుడైన కీర్తిశేషులు ముంగర దీనదయాల్ 93వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలకు, ఊరికి చేసిన సేవలు ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంటాయని ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన సేవలకు, ఆశయాలకు శిరస్సు వంచి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, కిన్నెర ఖగేంద్రరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతరాజుపేటలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్య సేవలందిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరురూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేటలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో పులిగిరి గ్రామం రాపూరు పంచాయతీ నెల్లూరు జిల్లాకు చెందిన కరుణామయి చారిటబుల్ ట్రస్ట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణంలో ఈ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సాధారణ, కంటి సంబంధ వ్యాధులు, సాధారణ శస్త్ర చికిత్స, ఎముకలు, కీళ్లు, దంత వైద్యుల నిపుణులు రోగులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. 500 మందికి పైగా వైద్య సేవలను వైద్యులు అందించారు.

లోయలో పడ్డ సిమెంటు లారీ

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు



గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో లోయలో పడ్డ సిమెంట్ లారీ

రామాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రెండవ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిమెంటు లారీ లోయలో పడి డ్రైవర్ ధనుంజయకు తీవ్రగాయాలైనట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. చిత్తూరు జిల్లా బంగారుపాలెంకు చెందిన లారీ డ్రైవర్ ధనుంజయ ఎర్రగుంట్ల నుంచి బెంగుళూరుకు ఎన్‌ఎల్01 ఎల్ 1786 నెంబరు గల సిమెంటు తీసుకెళ్తుండగా గువ్వలచెరువు రెండవ మలుపు వద్దకు రాగానే లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో వాహనం అదుపు తప్పి లోయలో పడింది. గమనించిన స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీసి రక్షించారు. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండకు శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు విశేషంగా తరలివచ్చారు. మల్లయ్యకొండ శివనామస్మరణతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కొండపైన గౌరమ్మ అమ్మవారికి, మార్గమధ్యలో ఉన్న ఏనుగు మల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

తపాలా శాఖ ఉద్యోగి చేతివాటం

- ప్రజలకు చెందిన రూ.18 లక్షలు స్వాహా?
- కేవీపల్లె మండలంలో ఘటన
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

పీలేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో పొదుపు, చింతలు లేని జీవితానికి మలుపు అంటూ తపాలా శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటుంది. ఆ ప్రచారానికి ఆ శాఖకు చెందిన సిబ్బంది తూట్లు పొడిచిన సంఘటన కేవీ పల్లె మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. కేవీపల్లె మండలం మల్లారపువాండ్లపల్లెకు చెందిన బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఖాతాదారుల సంతకాలు ఫోర్జరీ చేయడమే కాకుండా కొంతమందికి అసలు పాసుపుస్తకాలు కూడా ఇవ్వకుండా సొమ్మును కాజేశాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా నలిగి చివరకు తపాలా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా వారు అతడిని సస్పెండ్ చేశారు. అయితే తాము అతడి వద్ద జమ చేసిన సొమ్ము నిజంగా తపాలా శాఖకు వెళ్లిందో, అతనే కాజేశాడో తెలియక కొంత మంది ఆందోళన చెందుతుండగా తమ పాసుపుస్తకాలు తమకు ఇప్పిస్తే చాలని కొంతమంది మల్లారపువాండ్లపల్లె గ్రామస్థులు అధికారులను వేడుకుంటున్నారు.

రూ.18 లక్షల మేర స్వాహా?

కేవీపల్లె మండలం మల్లారపువాండ్లపల్లెలో బ్రాంచ్ పోస్టాఫీసు ఉన్నది. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న 14 గ్రామాల ప్రజల ఆర్థిక లావాదేవీలకు ఆ పోస్టాఫీసు కేంద్రంగా ఉండేది.

ఆందోళన చెందాల్సిన పని లేదు

మా శాఖ పాసు పుస్తకాల్లో ఎంట్రీ ఉన్న ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. వారందరికీ డబ్బు అందుతుంది. అతను పాసు పుస్తకాల్లో ఎంట్రీ వేయకుండా ఉంటే ఏమీ చేయలేము. అతడిపై ఫిర్యాదులు వచ్చిన మరుసటిరోజే అతనిపై ప్రాథమిక విచారణ జరిపి సస్పెండ్ చేశాం. పీలేరు ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండడంతో విచారణలో ఆలస్యం జరుగుతోంది. ఆయన వచ్చిన వెంటనే విచారణను వేగవంతం చేసి ఖాతాదారుందరికీ న్యాయం చేస్తాం.

- పవన్, పీలేరు ఇన్‌చార్జ్ తపాలా ఇన్‌స్పెక్టర్


మల్లారపువాండ్లపల్లెలోని తపాలా కార్యాలయం

ఉత్తరాల బట్వాడాతో పాటు తపాలా శాఖలో సంప్రదాయబద్ధంగా ఉండే ఆర్‌డీ, ఎస్‌బీ, సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), టైం డిపాజిట్‌లు, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పీఐఎల్), మని ఆర్డర్ సేవలు, ఉపాధి హామీ బిల్లులు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ సేవలు అందుబాటులో ఉండేవి. ఆ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా రెండేళ్ల క్రితం వచ్చిన చైతన్య ఆ గ్రామంలో జరిగే ఆర్థిక లావాదేవీలను తన అక్రమాలకు ఆలంబన చేసుకున్నాడు. తాను సూచించిన పథకాల్లో డబ్బు డిపాజిట్ చేసుకుంటే స్వల్ప కాలంలో అధిక రాబడులు ఉంటాయని చాలామంది మహిళల వద్ద డిపాజిట్‌లు సేకరించాడు. రూ.50 వేలు డిపాజిట్ చేస్తే ఏడాదిలోనే రూ.లక్ష వస్తుందని, రూ.లక్ష డిపాజిట్ చేస్తే రెట్టింపు అవుతుందని నమ్మబలికాడు.

దీంతో చాలామంది మహిళలు అతడి మాటలు నమ్మి అతనికి డబ్బు అందించారు. పీలేరులోని తపాలా కార్యాలయంలో పాసు పుస్తకాలలో ఎంట్రీ వేయించి ఇస్తానని చెప్పడంతో చాలామంది మహిళలు అతడిని తమ పాసుపుస్తకాలు కూడా అడగలేదు. దీంతో అతను యథేచ్ఛగా వారి నమ్మకాన్ని సొమ్ము చేసుకున్నాడు. అలా ఏకంగా రూ.18 లక్షల మేర ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశాడు. ఎంతకీ పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో కొంతమంది గ్యారంపల్లెలోని తపాలా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో అతడి బండారం బయటపడింది. నెల క్రితం అధికారులు విచారించి అతడి వద్ద పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకుని అతడిని సస్పెండ్ చేశారు.

నేను కట్టిన డబ్బు ఏమైందో తెలియడం లేదు



ఆ పిల్లోడిని నమ్మి నా పాసు పుస్తకాలు అతడి చేతిలో పెట్టి పోయిన మూడేండ్లుగా నెలకు రూ.1500 కట్టాను. ఇప్పుడు ఆ డబ్బు ఉందో, పోయిందో అర్థం కావడం లేదు. ఆ పిల్లోడు ఉన్నప్పుడు అడిగితే ఐదేళ్ల తరువాత తీసుకోవచ్చులే అనేవాడు. నా పాసు పుస్తకాలు చెక్ చేసి నాకు న్యాయం చేయండి.

- అలివేలమ్మ, మల్లారపువాండ్లపల్లె

రూ.1.40 లక్షలు కట్టాను



ఆర్‌డీ, టీడీ, లైఫ్ ఇన్సూరెన్స్ కలిపి నేను మొత్తం రూ.1.40 లక్షలు కట్టాను. నా పాసుపుస్తకాలు కూడా పోస్టాఫీసులోనే ఉన్నాయి. వాటిని చూసుకుందామంటే ఆఫీసర్లు కుదరదు అంటున్నారు. మా డబ్బులు మాకు తిరిగి ఇప్పించాలని పీలేరు పోస్టాఫీసులో కంప్లైంట్ కూడా ఇచ్చాను.

- రాధమ్మ, కిచ్చిలివారిపల్లె

లబోదిబోమంటున్న గ్రామస్థులు

బ్రాంచ్ పోస్టుమాస్టర్ అయిన చైతన్యను నమ్మి అతడి చేతిలో సొమ్ములు పెట్టిన గ్రామస్తులు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. తాము అతడికి ఇచ్చిన సొమ్ములు తమ పాసుపుస్తకాల్లో నమోదయ్యాయో లేదో కూడా తెలియడం లేదని, గ్యారంపల్లె, పీలేరులోని పోస్టాఫీసులలో అడిగితే అతడిపై విచారణ జరుగుతోందని, అప్పటి వరకు ఏమీ తేల్చి చెప్పలేమన్న సమాధానం వస్తోందని వారు వాపోతున్నారు. ఈలోపు అతని తరపున కొంత మంది గ్రామానికి వచ్చి అతను తీసుకున్న డబ్బులను రెండు, మూడు నెలల్లో తాము చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం వారు కూడా సరైన సమాధానం చెప్పడం లేదని బాధపడుతున్నారు.

నులిపురుగులను నివారిద్దాం

- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం


మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

సంబేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శరీరంలోని పేగుల్లో చేరిన నులిపురుగులను ఒక ఆల్బెండజోల్ మాత్రతో చెక్ పెట్టవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. నులిపురుగులు ఉంటే రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పి వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించి వారి పోషకాలను గ్రహించి వారిని శక్తిహీనులుగా మారుస్తాయి చిన్నవయస్సులోనే ఈ నులిపురుగులను నివారిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవు తారు. జాతీయ ఆరోగ్య సంస్థ నులిపురుగుల నివారణకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా...

పిల్లలు మట్టిలో ఆడుకుని చేతులు కడగకుండా భోజనం చేయడం ద్వారా నులిపురుగులు వ్యాప్తి చెందుతాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనలో ఈ పురుగులు వ్యాప్తి అవుతాయి. నులిపురుగుల బారినపడిన పిల్లల్లో ప్రధానంగా రక్తహీనత ఏర్పడుతుంది. పోషక లోపం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారతారు. తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు, మలంలో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ మాత్రల పంపిణీ

నులిపురుగుల నియంత్రణకు మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల వద్ద పిల్లలకు పంపిణీ చేస్తారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కావడంతో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. 1 నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 ఏళ్ల వారికి పాఠశాలలు, కళాశాలల్లో అందజేస్తారు. రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్రమే నీటిలో కలిపి తాగించాలి. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర 400 ఎంజీ వేయించాలి. అన్నమయ్య జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారు జిల్లా వ్యాప్తంగా 3,96,267 మంది ఉన్నారు.

ఏర్పాట్లన్నీ పూర్తి

నులిపురుగుల నివారణకు మాత్రలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వైద్య ఆరోగ్యశాఖ విజయవాడ అడిషినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. భోజనం చేసినతర్వాతనే వీటిని వేసుకోవాలి. మాత్రలు వేసుకున్న వారికి ఏవైనా సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో రియాజ్‌బేగ్, డీఐవో ఉషశ్రీ, డీఎల్ఏటీవో రమేశ్‌బాబు, పీవోఆర్‌బీఎస్‌కే శివప్రతాప్, డీఎస్‌ఎంవో విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయండి


లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన

తంబళ్లపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబరు 13న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన అన్నారు. సోమవారం స్థానిక సివిల్ కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో వాది, ప్రతివాది సయోధ్య అంగీకారంతో రాజీ మార్గంలో కేసులు పరిష్కారమవుతాయన్నారు. లోక్‌అదాలత్ ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కులు అందజేత


చెక్కులు పంపిణీ చేస్తున్న రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి

సుండుపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పంటలు నష్టపోయిన రైతులకు రూ.1.95 లక్షలు నష్టపరిహారం చెక్కులు అందజేసినట్లు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో ఆదేశాల మేరకు ఏనుగులు, అడవిపందుల వలన పంటలు నష్టపోయిన 10 మంది రైతులకు చెక్కులను అందజేశామన్నారు. పంటలు నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం ఈ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అడవి మృగాల వలన పంటలు నష్టపోయినట్లయితే వెంటనే ఫారెస్ట్ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందజేయడం పట్ల బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో అంజనస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మవరం-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు



ములకలచెరువు, ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి): ధర్మవరం నుంచి ములకలచెరువు మాదుగా నరసాపూర్‌కు ప్రతి రోజు నడిచే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు మంగళవారం నుంచి రద్దు కానున్నాయి. గుంటూరు సమీపంలోని పెదవడ్లపూడి - దుగ్గిరాల, తెనాలి-చందూరు రైల్వే సెక్షన్‌లో మూడవ రైలు మార్గం ప్రీఎస్ఐ, ఎన్ఐ పనుల కారణంగా ఈ రెండు రైళ్ళు పాక్షికంగా రద్దు చేస్తు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నరసాపూర్ నుంచి ధర్మవరం(17247)కు నడిచే రైలు మంగళవారం నుంచి ఈ నెల 19వతేదీ వరకు రద్దు చేశారు.

అలాగే ధర్మవరం నుంచి నరసాపూర్(17248) ఎక్స్‌ప్రెస్ రైలు కూడా మంగళవారం నుంచి ఈ నెల 19వతేదీ వరకు రద్దయ్యింది. ఈ నెల 20వతేదీ నుంచి రైళ్ళు తిరిగి నడవనున్నాయి. రైళ్ళ రద్దుతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా ములకలచెరువు, మదనపల్లె, కలికిరి, పీలేరు తిరుపతి తదితర ప్రాంతాల ప్రయాణికులకు ఎంతో అనుకూలంగా ఉన్న రెండు రైళ్ళు వారం రోజులపాటు రద్దయ్యాయి.

కౌలు రైతులను ఆదుకోలేని దుర్మార్గుడు జగన్

- జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమిదే విజయం
- సంక్షేమంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు
- బెంగళూరులో వర్క్ ఆట్ హోంలో ఉన్న జగన్‌కు ఏమి తెలుసు?
- అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే బాధితులకు న్యాయమేదీ!
- మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం


సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైల్వేకోడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గం అయిన పులివెందులలో గత వైసీపీ ప్రభుత్వంలో కౌలు రైతులు 21 మంది ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలను ఆదుకోలేని దుర్మార్గుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. సోమవారం రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పంపిణీ చేశారన్నారు. పులివెందులలో మృతి చెందిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని పవన్‌కళ్యాణ్ ఉమ్మడి కడప జిల్లాలోని సిద్దవటంలో రైతు సమావేశం ఏర్పాటు చేశారని సమావేశానికి పులివెందుల నుంచి 21 మంది కౌలు రైతులను గుర్తించి రావాలని సమాచారం అందిస్తే 17 మంది మాత్రమే వచ్చారని తెలిపారు. మిగిలిన కౌలు రైతు కుటుంబాలను వైసీపీ నాయకులు భయభ్రాంతులకు గురిచేయడంతో రాలేదన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు 113 మంది ఆత్మహత్య చేసుకుని చనిపోయారన్నారు. వారికి భరోసా ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి ఆదుకున్న ఘనత పవన్‌కళ్యాణ్‌కే దక్కిందన్నారు.

అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే వైఎస్ జగన్ పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. బాధితులకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట తప్పి 2024లో జరిగిన ఎన్నికల్లో కొట్టుకునిపోయారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కేసులు, పోలీసుల ఆంక్షలు పెట్టి ప్రజలను, ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు జరిగాయని తెలిపారు. మైసూరివారిపల్లెలో అకారణంగా, అన్యాయంగా జనసేన నాయకులపై కేసులు పెట్టారని గుర్తుచేశారు. ఇదే పంచాయతీలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కారుమంచి సంయుక్త జనసేన అభ్యర్థిగా విజయం సాధించిందన్నారు. అందుకనే రైల్వేకోడూరు అంటే పవన్‌కళ్యాణ్‌కు ప్రేమ ఉందన్నారు.

ఉమ్మడి కడప జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలు కూటమికే ఓటు వేస్తారని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో నిలవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీసి ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల్లో ప్రచారం చేశారని ప్రశ్నించారు. బెంగళూరులో వర్క్ ఆట్ హోంలో ఉన్న వైఎస్ జగన్‌కు ప్రజల గురించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఎలా నడపాలో తెలియదన్నారు. రైల్వేకోడూరులో శీతల గిడ్డంగిని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని తెలిపారు. ఉద్యాన పంటలైన మామిడి, అరటి, బొప్పాయి తదితర వాటికి మద్దతు ధర ఇచ్చింది కూటమి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ అందిస్తున్నామన్నారు.

అనుభవం కల్గిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పవన్‌కళ్యాణ్ ఆలోచనలతో రాష్ట్రం సుభిక్షంగా ఇంకా 15 ఏళ్లు పాటు ఉండాలన్నారు. రాష్ట్రంలో 4.40 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైల్వేకోడూరు వారికి అండగా, తోడుగా ఉంటామని చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోకుండా అందరూ కలసికట్టుగా ఉండాలన్నారు.

రాయచోటి మార్కెట్ కమిటీ

పాలకవర్గం నియామకం

కలికిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక సంవత్సరం కాల వ్యవధితో ఈ పాలకవర్గం ఏర్పాటైంది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే హోదాలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధ్యక్షుడిగా బోడిరెడ్డి రాంప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్లుగా కీర్తి, కోటకొండ శంకర, కాటిమాయకుంట చంద్రయ్య, జిల్లా రామతులసి, కొండా లక్ష్మి, వేల్పుల సుజాత, సానంపల్లె జ్యోత్స్న, తంగల వెంకట్రమణ, చామంతుల వెంకటనాగులు, కోటకొండ రఘునాథ, ఉదయగిరి మస్తాన్‌వలి, కూన బాల మురళీకృష్ణ, ముడే తవరా నాయక్‌లను నియమించారు. గొర్లముదివీడు సింగిల్ విండో చైర్మన్, రాయచోటి వ్యవసాయ ఏడీ, రాయచోటి మున్సిపాలిటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారులను కూడా కమిటీలో నియమించారు.

కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య


అనిల్ (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ కథనం మేరకు... గాలివీడు మండలానికి చెందిన అనిల్ (35), బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన స్వరూపను 12 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు జేమ్స్ (6), కుమార్తె లిపిక (4) ఉన్నారు. వీరు రెండేళ్ల క్రితం మదనపల్లె మండలం నిమ్మనపల్లె రోడ్డులోని బసినికొండకు వచ్చి నివాసం ఉంటున్నారు. అనిల్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ ఖర్చులు పెరగడంతో స్వరూప తిరుపతిలోని ఓ ప్రైవేటు రెస్టారెంట్‌లో పనిచేస్తోంది. పిల్లలు అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. కాగా అనిల్ ఆటో కొనుగోలు చేయడానికి రూ.30 వేలు కావాలని భార్య స్వరూపకు ఫోన్ చేశాడు. ఇప్పట్లో కుదరదని చెప్పడంతో వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు రోజుల తరువాత దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి భార్యకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ వెంకటరమణ తెలిపారు.

రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

సంబేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల సవరణ, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌వోలను నియమించి సంబంధిత నియామక పత్రాలను ఈఆర్‌వోలకు సమర్పించాలని తెలిపారు. కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలనుకుంటే దానికి ఎన్నికల సంఘం అవకాశం ఇస్తారన్నారు. సమావేశంలో రాజంపేట, మదనపల్లె సబ్‌కలెక్టర్లు, హెచ్ఎస్ భావన, చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం


షాపుపై పడిన 11 కేవీ వైరు

గుర్రంకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ బస్టాండులో ప్రజలు, వ్యాపారస్తుల సౌకర్యార్థం 11 కేవీ, ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేశారు. ఈ విద్యుత్ స్తంభాల నుంచి వ్యాపారులు, ప్రజలు కరెంట్ సరఫరాను దుకాణాలకు, ఇళ్లకు తీసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో బస్టాండులోని 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ సమయంలో కొంత మంది మాత్రమే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యుత్ వైర్లు ఒక దానిపై ఒకటి పడడంతో నిప్పు రవ్వలు రేగాయి. దీంతో ప్రయాణికులు పరుగులు తీశారు. పండ్లు, పూల దుకాణాలపై తెగిన విద్యుత్ వైర్లు పడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు, ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు తెగిన విద్యుత్ వైర్లను సరిచేశారు.

బావిలో పడి వ్యక్తి మృతి


చిన్నప్ప మృతదేహం

రామాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువ హరిజనవాడకు చెందిన రేణిమణి చిన్నప్ప (52) అనే వ్యక్తి సోమవారం బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ ఎగువహరిజనవాడకు చెందిన రేణిమాణి చిన్నప్ప బావిలో మోటారు చెడిపోయిందని ఉదయం 9 గంటల సమయంలో బావిలోకి దిగాడు. తదుపరి గంటల పాటు ఆయన పైకి రాకపోవడంతో గ్రామస్థులు ఆయన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఫైర్ డిపార్టుమెంట్ రామాపురం పోలీసులు, రెవెన్యూశాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బావిలో గాలింపు చర్యలను ప్రారంభించారు. మృతుడు బావిలో ఉన్న మోటారు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

గాలివీడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ మాతాశిశు సంరక్షణ డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీవార్మింగ్‌డే నులిపురుగుల నిర్మూలన, రక్తహీనత అధిగమించేందుకు విద్యార్థులకు కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అందులో భాగంగా మంగళవారం ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను మింగించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రియాజ్, డాక్టర్ శ్వేత, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, ఫయాజ్, హరీశ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


రాజన్న (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం ఎరగానిమిట్ట వద్ద గురువారం సాయంత్రం బీఎన్ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న అల్లూరి రాజన్న (55) జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఆటో కోసం వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజన్నను స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

వైసీపీ వ్యాజ్యం ఉపసంహరణ

● ఎస్ఈసీ, పోలీసులు నిబంధనల ప్రకారం నడుచుకుంటారన్న కోర్టు

అమరావతి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ఏజెంట్లకు భద్రత కల్పించేలా రాష్ట్రఎన్నికల సంఘం, పోలీసు అధికారులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ తరఫున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మల హేమంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వాజ్యం పై సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమన్నారు. ఎస్ఈసీ, పోలీసులు చట్టనిబంధనల ప్రకారం నడుచుకుంటారన్నారు. తాము ఏదైనా ఉత్తర్వులు జారీ చేస్తే క్లిష్టమైన పరిస్థితులకు దారి తీస్తాయని పేర్కొన్నారు. ఈ దశలో పిటిషనర్ తరపు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి జోక్యం చేసుకుంటూ పిటిషన్‌ను ఉపసంహరించుకొనేందుకు అనుమతించాలని కోరారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

మారెడ్డి భరత్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలంటూ వేసిన వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థికి మారెడ్డి లతారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డిని ఎస్ఈసీ, పోలీసులు కల్పించిన సౌకర్యాలను దుర్వినియోగం చేస్తున్నారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతకముందు పిటిషనర్ తరపు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ... స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి ఇచ్చామన్నారు. మారెడ్డి భరత్‌రెడ్డి తరపు సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.... ఓ పార్టీకి అభ్యర్థిగా మద్దతుగా స్వతంత్ర అభ్యర్థి ప్రచారం చేయకూడదని చట్టంలో ఎక్కడా లేదన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలన్నారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరైనవే : ధర్మాసనం

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ సమర్పించిన వినతి పై ఇప్పటికే ఎస్ఈసీ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేసింది. అప్పీల్‌ను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా పక్రియను రికార్డు చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే సమయంలో పోలింగ్ ఏజెంట్లను అనుమతించాలని, తటస్థ ఎన్నికల అబ్జర్వర్లను నియమించాలని, ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయకుండా పోలీసులను నిలువరించాలని కోరుతూ వైసీపీనేతలు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. వ్యాజ్యాల పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీతో పాటు జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీనేతలు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. అప్పీల్ సోమవారం విచారణకు రాగా సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... తటస్థ అబ్జర్వర్లను నియమించాలని, సీసీకెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నిక ప్రక్రియను రికార్డు చేయాలన్న పిటిషనర్ వినతిని సింగిల్ జడ్జి తిరస్కరించారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఎన్నికను స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించాలని సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులే ఇచ్చారని స్పష్టం చేసింది.


పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల



మైలవరం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ, పోలీసు అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా.. ఉత్తర, దక్షిణ కాలువలకు 100 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. దీనికితోడు వర్షం ధాటికి ఎక్కువగా నీటి ప్రవాహం ఉందని, పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం నీటి నిలువ సామర్థ్యం 6.5టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రస్తుతం 5.4 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉధృతంగా పెన్నా ప్రవాహం



పెన్నానదిలో లోలెవల్ కాజ్‌వేపై వరద నీటి ప్రవాహం

సిద్దవటం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గంట గంటకు నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు గ్రామాలైన వంతాటిపల్లె, గాండ్లపాలెం, ఆకుల వీధి, జ్యోతి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో నీటిమట్టం పెరగడంతో లోలెవల్ కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోందని, చేపల వేటకు వెళ్లే జాలర్లు వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశామని, కొన్ని పల్లె ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లపై రూల్స్ విడుదల

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలపై సాంకేతిక విద్యాశాఖ కొత్త రూల్స్ విడుదల చేసింది. 'ఏపీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల నియంత్రణ, రాష్ట్ర స్థాయి సాంకేతిక విద్యాసంస్థల నిబంధనలు-2025' పేరుతో ఈ రూల్స్ రూపొందించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ 1988లో ఇచ్చిన 146 జీవో ఆధారంగానే ప్రతి సంవత్సరం పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రతి ఏడాదీ సవరణలు ఇస్తున్నారు. ఇకపై ప్రతిసారీ సవరణల అవసరం లేకుండా కొత్త రూల్స్ జారీచేశారు. పాలిసెట్ నిర్వహణ, పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలే యథావిధిగా అమలవుతాయి. పాలిసెట్, అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం కొనసాగుతుంది. ఇందుకోసం వేర్వేరుగా కమిటీలు నియమించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రూల్స్ అమల్లోకి వస్తాయి.

కాంట్రాక్టు జేఎల్స్‌ను క్రమబద్ధీకరించాలి

అమరావతి, తాడేపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ తిరిగి ప్రారంభించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు జేఎల్స్‌ను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభించారని, ఎన్నికల సమయంలో దానికి బ్రేక్ పడిందని, ఇప్పుడు తిరిగి కొనసాగించాలని నినాదాలు చేశారు. ఇంటర్ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ తాతారావుకు వినతిపత్రం అందజేశారు.

నా కారు ఇప్పించి ఆదుకోవాలి

● జిల్లా అధికారులకు ఓ బాధితుడి ఆవేదన

కడప మారుతీనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం కారు కొనుగోలు చేసి జీవి స్తున్నానని, తన కారును బాడుగ పేరుతో తీసుకెళ్లి ఓ వ్యక్తి మో సం చేశాడని గోపవరం మండ లం మడకలవారిపల్లెకు చెందిన జి.సిద్దయ్య ఆవేదన వ్యక్తం చేశా రు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ 31 టీపీఏ 1113 అనే నెంబరు గల తన ఇథియో కారును 2024 మార్చిలో కొను గోలు చేసి బాడుగలకు తిప్పుకుని జీవనం సాగిస్తున్నానన్నారు. ఈ క్రమంలో బద్వేలుకు చెందిన సుంకర విశ్వనాథ్ అనే వ్యక్తి తన కారు ను నాలుగు రోజులు బాడుగకు అని చెప్పి తీసుకెళ్లి... తిరిగి తనకు ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై తనను అడగ్గా... కడపలోని ఓ ప్రభుత్వ కార్యాలయానికి బాడుగకు పెట్టానని, నెలకు రూ.21,500 వస్తుందని.. ఆ డబ్బులు ఇస్తానని చెప్పాడన్నారు. ఒక నెల డబ్బులు మాత్రం ఇచ్చాడని, తరువాత డబ్బులు ఇవ్వకుండా.. కారు అప్పగించకుండా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. ఈ విషయంపై ఎనిమిది నెలల క్రితం ఎస్పీకి ఫిర్యాదు చేయగా.. బద్వేలు స్టేషన్‌కు రెఫర్ చేశారన్నారు. అక్కడ తనకు న్యాయం చేయడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి తన కారును తనకు ఇప్పించాలని కోరారు. సమావేశంలో కత్తి చెంద్రాయుడు, జాషువా, కేశవ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

● మోడల్‌స్కూల్ స్టేట్ అబ్జర్వర్ నాగేంద్రకుమార్



మోడల్ స్కూల్ సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ నీట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ పీవీ నాగేంద్రకుమార్ తెలిపారు. సోమవారం జిల్లాలోని పలు ఏపీ మోడల్ స్కూల్స్‌ను పరిశీలించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం భుజించి రుచిని, నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలోని సిబ్బందితో సమావేశమై ఆహారం, పరిశుభ్రత, క్రమశిక్షణ విషయంలో సూచనలు సలహాలు ఇచ్చారు. ఆహారం రుచికరంగా, నాణ్యతగా అందించాలన్నారు. పిల్లలు రోగాల బారినపడకుండా ఉండాలంటే పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం ఎఫ్ఏ-1 పరీక్షలు జరుగుతున్నందున పిల్లల స్టాండర్డ్స్‌ని పరిశీలించారు .పిల్లల స్టాండర్డ్స్ పెంచడంలో ఎక్కడా రాజీపడకుండా మంచి విద్యను అందించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ క్లాసులు ప్రసారమవుతున్నాయన్నారు. వాటిని వినియోగించుకొని పిల్లలు చక్కగా చదువుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు పాఠశాల సిబ్బంది చేయాలని ఆదేశించారు. పిల్లలు సక్రమంగా వినియోగించుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని హితబోధ చేశారు. అబ్జర్వర్ వెంట కడప జీసీడీఓ దార్ల రూత్‌ఆరోగ్య మేరీ ఉన్నారు.

తలసరి ఆదాయంపై మోడీవి అవాస్తవాలు

వేంపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తలసరి ఆదాయంలో భారత్ దూసుకుపోతోంది, నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని, మూడవ స్థానానికి చేరుతుందని ప్రధానిమోడీ చెప్పేవి అవాస్తవాలని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. 191 దేశాలలో తలసరి ఆదాయంలో భారత్ 137వ స్థానంలో ఉందని, ఇటీవల విడుదలైన ఇంటర్నేషనల్ మానిటరంగ్ ఫండ్ నివేదిక చెబుతోందన్నారు. జనాభా ఎక్కువ ఉన్న కారణంగా జీడీపీ ఎక్కువ కనిపిస్తోంది. అందువల్ల జీడీపీలో ముందు ఉన్నట్లు అనిపిస్తుంది తప్ప ప్రపంచంలోని మిగతా దేశాలతో పోల్చితే వెనుకబడి ఉందని తులసిరెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి కోరారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని.. ఆసక్తిగలవారు మైలవరం బాలికల గురుకుల పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తామని, ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయస్థాయి కరాటే పోటీలలో పార్నపల్లె విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

లింగాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ నిషార్, ఆర్.కుషాల్ కుమార్‌లు కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం జరిగిన 7వ జాతీయస్థాయి ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025లో ప్రతిభ చూపారు. ఈ పోటీలలో షేక్ మహమ్మద్ నిషార్ గోల్డ్ మెడల్ సాధించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఖోఖో పోటీలకు సోదరుల ఎంపిక



ఎంపికైన సోదరులు ముక్తుమ్‌సాబ్, అబ్దుల్‌కలాం

దువ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామానికి చెందిన ఎస్.ముక్తుమ్‌సాబ్, వీరి సోదరుడు అబ్దుల్‌కలాం రాయలసీమ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఖాదర్‌రెడ్డి తెలిపారు. కడపలోని స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో వీరు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో ఈనెల 16, 17, 18 తేదీల్లో రాయలసీమస్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు.

స్కూటర్లు ఢీ... ఇరువురికి గాయాలు



తలకు గాయమైన ఈశ్వర్‌రెడ్డి

ఖాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె సమీపంలో రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు రహమత్‌ఖాన్‌పల్లెకు చెందిన ఇ.చిన్ననాగిరెడ్డి పని నిమిత్తం ఖాజీపేటకు వస్తున్నాడు. అదే సమయంలో బద్వేలు నియోజకవర్గం కొంగలవీడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి పులివెందుల నుంచి ఇంటికి వెళుతున్నాడు. కోటంగురాయునిపల్లె సమీపంలోకి రాగానే రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 ద్వారా కడపకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ప్రశాంత్ (ఫైల్‌ఫొటో)

కొండాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంక య్యకాలువ గ్రామంలో ఈనెల 9వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ప్రశాంత్ (22) అనే యువకుడు గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చదువు మానేసి ఇం ట్లోనే ఉంటున్నాడు. చిన్న వయసులోనే షుగర్‌వ్యాధి రావడంతో జీవితం మీద విరక్తి చెంది 9వ తేదీ సాయింత్రం ఇంట్లోనే గడ్డిమందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు అతనిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసు పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌నాయక్ తెలిపారు.

కుక్క అడ్డురావడంతో.. స్కూటర్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



ఖాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని ఖాజీపేట బ్రిడ్జీ వద్ద సోమవారం కుక్కను ఢీకొనడంతో దిలీప్‌కుమార్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ప్రొద్దుటూరు రాజుపాళెంకు చెందిన దిలీప్‌కుమార్ పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వెళుతుండగా ఖాజీపేట బ్రిడ్జీ వద్ద కుక్కలు అడ్డం రావడంతో స్కూటర్ అదుపు తప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా ప్రొద్దుటూరుకు తరలించారు.

బ్రహ్మంగారిమఠంలో...



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సోమి రెడ్డిపల్లెకు చెందిన బొమ్ము రామ్మోహరెడ్డి ద్విచక్రవాహనంపై మైదుకూరుకు వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగర డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. జాతీయ క్రీడాదినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం బ్యాడ్మింటన్ ఎంపికలు జరిగాయి. ఇందులో సుమారు 40మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టు ఎంపిక చేశారు. ఈసందర్భంగా డీఎస్‌డీవో జగన్నాథరెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడలో కడప జిల్లాకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16, 17 తేదీల్లో తిరుపతిలో జరగనున్న జోనల్‌స్థాయి పోటీల్లో.. అనంతరం విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ సుదర్శన్, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

జోనల్ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు : పూజిత, రెడ్డిపద్మిని, సాయి నిఖిత, బి.కళ్యాణి **బాలుర జట్టు :** విశ్వతేజ, యోగేశ్, జశ్వంత్, పవన్‌రెడ్డి

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.28లక్షలు



ఆలయ ప్రాంగణంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న భక్తులు హుండీలో స్వామివారికి సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.28,22,899 నగదు వచ్చినట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరాచారి, దేవదాయశాఖ ఆఫీసరు భారతి తెలిపారు. అలాగే బంగారు 35.500 గ్రాములు, వెండి 990 గ్రాములు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.లక్షా 1116 విరాళం

జగన్మాత ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణం కోసం దాతలు రూ.1,01116లు విరా ళం ఇచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడ వాసి జి.శ్రీనివాస చక్రవర్తి తన కుటుంబసభ్యులతో కలిసి విరాళ చెక్కును మఠాధిపతి వీరశివకుమారస్వామికి అందజేసినట్లు ఆయన తెలిపారు.

లోయలో పడ్డ సిమెంటు లారీ

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు

రామాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రెండవ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిమెంటు లారీ లోయలో పడి డ్రైవర్ ధనుంజయకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. చిత్తూరు జిల్లా బంగారుపాలెంకు చెందిన లారీ డ్రైవర్ ధనుంజయ ఎర్రగుంట్ల నుంచి బెంగుళూరుకు ఎన్ఎల్01 ఎల్ 1786 నెంబరు గల సిమెంటు తీసుకెళ్తుండగా గువ్వలచెరువు రెండవ మలుపు వద్దకు రాగానే లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో వాహనం అదుపు తప్పి లోయలో పడింది. గమనించిన స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీసి రక్షించారు. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

కలకడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రాయచోటికి మార్చబడ్డ కలకడ బాలికల గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8వ తరగతిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆయేషాబాను తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి వివిధ కేటగిరీలకు సంబంధించి 5వ తరగతిలో 51, 6 తరగతిలో 41, 7తరగతిలో 22, 8వ తరగతిలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికేట్, వార్షిక ఆదాయం ధృవీకరణ పత్రాలతో ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 16వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.


మదనపల్లె-1 డిపోలో డ్రైవర్లు కావాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె-1 డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల వయస్సు 21 నుంచి 40 ఏళ్ల వరకు ఉండి ఆర్టీఏ క్లియరెన్స్ ధ్రువపత్రాలతో దరఖాస్తులను డిపో కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఎంపికైన వారిని రోజువారి అవసరాల మేరకు విధుల్లోకి తీసుకొంటామని తెలిపారు.

15న ఆడికృత్తిక మహోత్సవం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక నిమ్మనపల్లె రోడ్డులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన శుక్రవారం ఆడికృత్తిక (రావళ్ల పండుగ), 16న శనివారం స్వామివారి దర్శనం కల్పిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. 36 అడుగుల అభయ వరద సుబ్రహ్మణ్యస్వామి నిర్మాణానికి దాతలు స్పందించి విరాళాలు అందించాలని కోరారు.

వన్ టౌన్ సీఐగా మహ్మమద్ రఫీ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ మహమ్మద్‌రఫీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వన్ టౌన్ సీఐగా సోమవారం మహమ్మద్ రఫీ బాధ్యతలు చేపట్టారు. ఈయన రాయచోటి నుంచి బదిలీపై మదనపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలను కాపాడుటకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. నేరాలు తగ్గించడానికి ప్రయత్నం చేయనున్నట్లు చెప్పారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో సిబ్బందిని పరిచయం చేసుకున్నారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండకు శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులు విశేషంగా తరలివచ్చారు. మల్లయ్య కొండ శివనామస్మరణతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భ్రమరాంభ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే కొండపైన గౌరమ్మ అమ్మవారికి, మార్గమధ్యలో ఉన్న ఏనుగు మల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మునిరాజ ఆధ్వర్యంలో కొండపైన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

మహాభారత యజ్ఞంలో అర్జున తపస్సు

నిమ్మనపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లిలో గత నెల 27నుండి ప్రారంభమైన ద్రౌపతి సమేత ధర్మరాజుల మహాభారత యజ్ఞం ద్విజయంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ఉదయం అర్జున తపస్సు, రాత్రి ఉత్తర కల్యాణ ఘట్టాన్ని కథకురాలు కౌసల్య ఆలపించారు. ఇందులో ఒక్కో హరికథ, నాటకాలకు ఒక్కో ఉభయదారులుగా వుండి మహాభారత యజ్ఞాన్ని పూర్తి చేస్తారు. అయితే మహాభారత యజ్ఞం ఈనెల 14న జరిగే ధర్మరాజు పట్టాభిషేకంతో పూర్తవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుండి వచ్చి తిలకిస్తున్నారు. తబలిస్టుగా గోవర్దన్, హార్మోనియం నారాయణప్ప వ్యవహరించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

● తాగునీటి కష్టాలు.. ● కనిపించని సిమెంటు రోడ్డు ● దేవళంపేట వీధి ప్రజల దుస్థితి



స్థానిక పీటీఎం దేవళంపేట వీధిలో వర్షపునీటిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు

పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలోని స్థానిక శివాలయం వద్ద దేవళంపేట వీధిలో కనీస సౌకర్యాలు కల్పించాలని స్థానికులు వాపోతున్నారు. మండల కేంద్రమైన పీటీఎంలోని దేవళంపేట వీధిలో సుమారు 25 కుటుంబాలు కాపురముంటున్నారని, కనీసం ఈ వీధికి తాగునీటి సౌకర్యం, మురుగు కాలువలు లేవని, సిమెంట్ రోడ్డు కూడా ఇంతవరకు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారు లేరని ఆరోపిస్తున్నారు. దేవళంపేట వీధిలో సుమారు పది సంవత్సరాలుగా కాపురం చేస్తున్నామని, ప్రజాప్రతినిధులు మాత్రం ఎన్నికల సమయంలో వాగ్దానాలు ఇచ్చి తర్వాత తమ సమస్యలను గాలికొదిలేస్తున్నారని వాపోయారు. వర్షాకాలం వచ్చిందంటే వీధులన్నీ జలమయమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మంచినీటి సౌకర్యంతో పాటు మురికి నీటి కాలువలు, సిమెంట్ రోడ్డును ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బోయకొండ ఆలయ చైర్మన్ పదవిని

వాల్మీకులకు కేటాయించాలి



ఆలయ పూజారి ద్వారా అమ్మవారికి వినతిపత్రం అందిస్తున్న వాల్మీకిసంఘం నాయకుడు ముత్తరాశి హరికృష్ణ

మదనపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని వాల్మీకులకు కేటాయించాలని వాల్మీకి మహాసేన వ్యవస్థాపకుడు ముత్తరాశి హరికృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అమ్మవారికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవిని 2012 నుంచి డిమాండ్ చేస్తూ ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలు, రాస్తారోకోలో చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఎన్నికలకు ముందు అన్ని పార్టీలూ వాల్మీకులకే ఇస్తామని చెబుతున్నాయని, తీరా గద్దెనెక్కాక మొండిచేయి చూపుతున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని ఆశిస్తున్నామని, అప్పటికీ న్యాయం చేయకుంటే మరోసారి ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు విజయ్ కుమార్, దేవరింటి సుధాకర్, చంగల్‌రాయుడు, మిద్దింటి రవికిశోర్, బొంత శ్రీనివాసులు, గోపాల్, చిప్పిలి చినరాయుడు, చలపతి, సుదర్శన్, రాజేష్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ లోపాలు

● నేడు సంక్షేమ పథకాలకు అర్హులు దూరం

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో వలంటీర్లు ఇష్టారాజ్యంగా హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేయడంతో అందులోని లోపాలతో నేడు అర్హులైన పేదలు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ అన్నారు. సోమవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం పర్యటనలో ప్రజల నుంచి పెద్దసంఖ్యలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ లోపాలు బయటపడ్డాయన్నారు. ముఖ్యంగా టీడీపీ సానుభూతిపరులను జాయింట్ కుటుంబాలుగా చూపించడం వలన అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందలేదన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం వుందన్నారు. అదేవిధంగా ఉపాధిహామీ పథకం కింద చేసిన పనులకు ఎనిమిది నెలలవుతున్నా బిల్లులు చెల్లించలేదని, దీనిపై డిప్యూటీ సీఎం పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాటకొండ మధుబాబు, పూల మురళి, ఒంటికొండ వెంకటేశ్, శ్రావణ్, చంద్రశేఖర్‌నాయుడు, శివశంకర్ పాల్గొన్నారు.

బీజేపీ దేశంలో

విద్వేషాలు రెచ్చగొడుతోంది

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరయ్య

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ 12 ఏళ్లుగా పాలన చేస్తూ ప్రజల మధ్య, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోందని, బీజేపీకి వ్యతిరేకంగా వాపపక్షాలు, అంబేద్కరిస్టులు, వామపక్ష అభిమానులు ఏకం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సీపీఐ మహాసభలను సోమవారం స్థానిక శేషసాయి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ దేశంలో కార్పొరేట్ల ఆస్తులు పునఃపంపిణీ జరాగాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. బీజేపీ పాలనలో దేశం ప్రమాదంలో పడిందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను బిక్షగాళ్లుగా మార్చవద్దన్నారు. బీజేపీ ప్రభుత్వంలో అన్ని ధరలు మండిపోతున్నాయని, రైతులకు అన్యాయం చేస్తూ నల్ల చట్టాలు అమలు చేస్తున్నారని ఆరోపించారు. నిరంకుశ, మతతత్వ మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను ఉపయోగిస్తోందన్నారు. కొత్త ప్రాజెక్టుల కన్నా పెండింగ్‌లో ఉన్న వాటిని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామనాయుడు, శివారెడ్డి, చిన్నంపెంచులయ్య, జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, మహేష్, తుమ్మల రాధాకృష్ణ, సాంబశివ, కృష్ణప్ప, మురళి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేయాలి



ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న బాలల హక్కుల ఐక్య వేదిక సభ్యులు

పెద్దమండ్యం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని బాలల హక్కుల ఐక్యవేదిక సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎంఈవో మనోహర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గ్రామీణ విద్యార్థినుల విద్యాభివృద్ధి కోసం చంద్రబాబునాయుడు ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారని, విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా సీఎం చంద్రబాబునాయుడు ఆ దిశగా చర్యలు తీసుకొని విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల ఐక్యవేదిక సభ్యులు అజీత, భువనేశ్వరీ, రమణ, శైలజ, పోర్దు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు భూములను గుర్తించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ, ఫారెస్టు భూములను గుర్తించాలని తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లోని ప్రభుత్వ, అడవి, చిట్టడివి స్థలాలను గుర్తించాలన్నారు. చాలావరకు వెబ్ ల్యాండ్‌లో ఫారెస్టు భూముల వివరాలను జీరో చూపుతున్నట్లు వీర్వోలు వివరించారు. కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీటీఎంకు చెందిన చంద్రయ్య దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎక్కువగా చీకలబైలు, పోతబోలు, అంకిశెట్టిపల్లె, పెంచుపాడు, సీటీఎం గ్రామాల్లో ఆటవీభూములు ఉన్నప్పటికీ రికార్డులో చూపడం లేదన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, వీఆర్వోలు పాల్గొన్నారు.



పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్

మంత్రి నాదెండ్లను కలసిన జంగాల శివరామ్

మదనపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో మదనపల్లె వ్యవసాయ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ కలిసి స్వాగతం పలికారు. రైల్వేకోడూరు మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా పగడాల వరలక్ష్మి ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన మంత్రికి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్‌తో కలసి మంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా మదనపల్లె నుంచి జనసైనికులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి



చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఉద్యోగులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానం రద్దు కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సౌరకాయల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ వద్ద చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏడాదిలో సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఏడాది పూర్తయినా ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రంజిత్ మాట్లాడుతూ ఐదేళ్లు పనిచేసే ఎమ్మెల్యేలు, ఎంపీలకు పెన్షన్ చెల్లిస్తున్నారని, కానీ 35 ఏళ్లు ఉద్యోగం చేసే ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రకుమార్, నరేశ్, గణేశ్, భూపతి, శ్రీనివాసులు, కిల్లా నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాహుదాకు జలకళ

కలకడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైప్రాంతాల నుండి అధికంగా వర్షపునీరు చేరుతుండడంతో మండల పరిధిలోని బహుదానది జలకళను సంతరించుకుంది. సోమవారం ఉదయం నుండి సాయంత్రం దాకా ఓ మోస్తారు వర్షం కురవడంతో ప్రవాహం మరింతగా పుంజుకుంది. 2023 అక్టోబర్, నవంబరు మాసాలలో తుఫాను ప్రభావంగా కురిసిన వానల సమయంలో నదిలో ఇలాంటి నీటి పారుదల వున్నట్లు ప్రజలు తెలిపారు. వరుణదేవుడు కరుణించి జలధారను పారించడంతో రైతన్నల కళ్లల్లో ఆనందం కనిపించింది.



బహుదానదిలో నీటి ప్రవాహం

సర్కారుతోపు సమీపంలో లక్కీ టైల్స్ ప్రారంభం



టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న నగేశ్

కురబలకోట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్కారు తోపు సమీపంలో లక్కీ టైల్స్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి సోమవారం ప్రారంభించారు. మదనపల్లెకు చెందిన టైల్స్ యజమాని నగేశ్ ఈ దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన టైల్స్‌ను అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజరవర్గ సమన్వయ కర్త మల్లికార్జుననాయుడు, దేవత సతీష్, ఉదయ్ మోహన్‌రెడ్డి, ప్రశాంత్, రవికుమార్, నారాజ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి



నిర్దేశిత సమయంలో సమస్యలను పరిష్కరించాలి

● సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లె టౌన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి సూచించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను ఉద్దేశించి సబ్‌కలెక్టర్ సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా వస్తున్నాయని, ఈ సమస్యలపై విచారించడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల కోసం కొంత సమయం కేటాయించి వాటిని పరిష్కరించాకే, మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం డివిజన్‌లోని 11మండలాల నుంచి వచ్చిన 59 మంది అర్జీదారుల సమస్యలను సబ్‌కలెక్టర్ సావధానంగా విని సమాధానం చెప్పారు. కార్యక్రమంలో డీఏవో నిర్మలాదేవి, అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీల పట్ల కాలయాపన వద్దు

పీలేరు రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీపై విచారణ జరిపి నిర్దీత గడువులోపు పరిష్కరించాలని, ఇందులో ఎటువంటి కాలయాపన ఉండరాదని ఏడీఏ వైపీ రమణరావు, ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అధికారి పీజీఆర్ఎస్‌కు విధిగా హాజరు కావాలని సూచించారు. ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, ఏపీవో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి తీసుకురావాలి



నిమ్మనపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకొచ్చి వారి సమస్యను పరిష్కరించుకోవాలని ఎంపీడీవో రమేశ్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల మందులు పంపిణీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో మనోహర్‌రాజు, వైద్యాధికారులు

వాల్మీకిపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు ఈనెల 12వ తేదీ నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో మనోహర్ రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందరర్భంగా మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సంవత్సరం నుండి 19ఏళ్లలోపు పిల్లలందరికీ ఈ నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గైర్హాజరైన విద్యార్థులకు 20వ తేదీ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పిల్లలలో రక్తహీనతను తగ్గించడానికి ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలుగా ఆగస్టు, ఫిబ్రవరి నెలల్లో ఈ మందులు పంపిణీ చేసి విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రిచర్డ్‌స్టీఫెన్, డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో వెంకటలక్ష్మి, ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ములకలచెరువు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై సోమవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రేష్మాబేగం మాట్లాడుతూ మంగళవారం జరగనున్న ఈ కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు మింగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇందిర, శాంతమ్మ, నిర్మల, లలిత, శైలజ, అరుంధతి, సందీప, ఖాదర్‌బాషా, పవన్, ఆశా కార్యకర్తలు అమరావతి, కళావతి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సులో ప్రసవం

● తల్లీబిడ్డ క్షేమం

తంబళ్లపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అంబులెన్సులో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, 108 సిబ్బంది వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తాండా పంచాయతీ గుడ్లవారిపల్లెకు చెందిన మహేష్ నాయుడు భార్య నవనీతకు పురిటి నొప్పులు రావడంతో ఆదివారం అర్ధరాత్రి సమయంలో తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించారు. వెంటనే ప్రాథమిక చికిత్సలు అందించి పరీక్షించిన వైద్యులు కాన్పు కష్టమవుతుందని, మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. ఈ క్రమంలో అంబులెన్సులో మదనపల్లెకు తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో ముదివేడు వద్ద నొప్పులు ఎక్కువవ్వడంతో ఈఎంటీ మోహన, పైలెట్ దేవేంద్ర సాయంతో ప్రసవం చేశారు. సుఖ ప్రసవం కాగా నవనీత పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. కాగా సుఖ ప్రసవం అయ్యే అవకాశమున్నా తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మదనపల్లెకు రెఫర్ చేస్తూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. అయితే సుఖ ప్రసవం చేసే అవకాశమున్నా బ్లీడింగ్ ఎక్కువగా ఉండటంతో ప్రసవం తరువాత తల్లీబిడ్డ క్షేమం కోసం మెరుగైన వైద్య సౌకర్యాలున్న మదనపల్లె వైద్యశాలకు రెఫర్ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ తేజశ్విని తెలిపారు.